DATE: 24-07-2022 RNI NO : TELTEL/2021/81092

ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

సంపుటి(Volume) : 3
సంచిక(Issue) : 100


పేజీలు - 08
వెల: రూ 5/-

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

prajamantalu.com

ఆదివారం 24 జూలై, 2022

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



అతిగా వ్యవహరిస్తున్న మీడియా
కోర్టులకన్నా ముందే తీర్పులు ఇచ్చేస్తోంది

5లో



నేడు హైదరాబాద్‌లో బోనాల జాతర
రెండ్రోజుల పాటు వైన్‌షాపుల మూత

2లో



# రాజకీయపార్టీలు పక్షపాతధోరణి వీడాలి

- దేశంకోసం ఐక్యంగా పనిచేయాలి
- వీడ్కోలు సమావేశంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్
- నేటితో ముగియనున్న రాంనాథ్ కోవింద్ పదవీ కాలం

**న్యూఢిల్లీ,జూలై23:** పక్షపాత ధోరణికి అతీతంగా రాజకీయ పార్టీలు నడుచుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సూచించారు. రాష్ట్రపతిగా దేశానికి సేవ చేసుకునే అవకాశం ఇచ్చిన ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. పార్లమెంట్ సభ్యులతో కూడిన పెద్ద కుటుంబంలో తాను ఒక భాగమని.. కుటుంబంలో భిన్నాభిప్రాయాలు ఉన్నా దేశ ప్రయోజనాల కోసం పనిచేయాలని సూచించారు. రాజకీయ పార్టీలు దేశ ప్రయోజనాల దృష్ట్యా పక్షపాత రాజకీయాలకు దూరంగా ఉండాలన్నారు. రాష్ట్రపతిగా రామ్‌నాథ్? కోవింద్ పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చే

మిగతా 2లో..

# భయపెడుతుంది



**హైదరాబాద్,జూలై23:** జంటనగరాలను ముంచెత్తిన వర్షం శనివారం కొంచెం తెరిపిచ్చింది. శుక్రవారం ఏకధాటిగా కురిసిన వానకు జంటనగరాలు తడిసి ముద్దయ్యాయి. అలాగే రాష్ట్రంలోనూ కొంత ఊరట కలిగించేలా వర్షాల జోరు తగ్గింది. వర్షాల కారణంగా భాగ్యనగరంలోని జంట జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. అలాగే మూసీ పొంగి ప్రవహిస్తోంది. ఇకపోతే భద్రాచలం వద్ద మరోమారు వరద ఉధృతి పెరిగింది. పలు జిల్లాల్లో వాగులు పొంగుతున్నాయి. ఉస్మాన్‌సాగర్ ఇన్‌ఫ్లో 2000 క్యూసెక్కులుగా ఉంది. దీంతో అధికారులు ఉస్మాన్ సాగర్ నాలుగు గేట్లను ఎత్తి 832 క్యూసెక్కుల నీటిని మూసీలోకి విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా... ప్రస్తుత నీటి మట్టం 1786.65 అడుగులకు చేరింది. అటు హిమాయత్ సాగర్ కు 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు హిమాయత్ సాగర్ రెండు గేట్లను ఎత్తి 330 క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదులుతున్నారు. హిమాయత్ సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1763.50 అడుగులకు గాను... ప్రస్తుత నీటి మట్టం 1760.50 అడుగులకు చేరింది. మూసీ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. హైదరాబాద్‌లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలతో నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో అధికారులు ఏడు గేట్లు రెండు అడుగుల మేర

మిగతా 2లో..

- నగరంలో శాంతించిన వరుణుడు
- పలు జిల్లాల్లోనూ తగ్గిన వర్షాలు
- వర్షాలతో మరోమారు ప్రాజెక్టులకు జలకళ
- హైదరాబాద్ జంట జలాశయాలకు భారీగా వరద
- ఉప్పొంగుతున్న మూసీనది.. గేట్లు ఎత్తివేత
- ఉగ్రరూపం దాల్చిన తాలిపేరు
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి ఉధృతి
- వరంగల్‌లో వర్షాలకు కూలిన పాతభవనం
- ప్రమాదంలో యువకుడు మృతి
- నిండుకుండలా శ్రీశైలం జలాశయం
- గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసిన మంత్రి

## గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా మంకీపాక్స్

- మంకీపాక్స్ వ్యాధిని గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా గుర్తింపు
- ప్రపంచానికి పెనుముప్పుగా డబ్ల్యూహెచ్ఓ పరిగణ




**న్యూఢిల్లీ,జూలై23:** ప్రపంచ ఆరోగ్య సంస్థ ( డబ్ల్యూహెచ్ఓ) కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న మంకీపాక్స్ వ్యాధిని అసాధారణ సంఘటనగా పరిగణించింది. కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో పాటు వివిధ దేశాలకు విస్తరిస్తుండటంతో మంకీపాక్స్ ను ప్రపంచ ఆరోగ్య అత్యవసర స్థితిగా ప్రకటించింది డబ్ల్యూహెచ్ఓ. ఇప్పటికే ప్రపంచ

మిగతా 2లో..

## తెలంగాణలో కొత్తగా.. 13 మండలాలు

- ఉమ్మడి నిజామాబాద్‌లో కొత్తగా 4 మండలాలు
- నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్,జూలై23:** తెలంగాణలో కొత్తగా 13 మండలాలు ఏర్పాటు అయ్యాయి. ప్రజల ఆకాంక్ష, స్థానిక ప్రజా అవసరాలను పరిశీలించి, పరిపాలనా సంస్కరణల్లో భాగంగా మరికొన్ని మండలాలను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్

మిగతా 2లో..

## తాజా వర్షాలతో గోదావరి మరింత ఉధృతం

- గోదావరి వరదలపై ప్రజలకు ముందస్తు హెచ్చరికలు
- అధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- అధికార యంత్రాంగానికి పరీక్షా కాలమని సూచన
- మంత్రులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలి
- వర్షాలపై అధికారులను అప్రమత్తం చేసిన సీఎం కేసీఆర్
- భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి
- అధికారులకు సీఎస్ సోమేశ్ కుమార్ ఆదేశాలు

**హైదరాబాద్,జూలై23:** రాష్ట్ర వ్యాప్తంగా మరో 3 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులను సీఎం కేసీఆర్ అప్రమత్తం చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలపై ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. గోదావరి నది తన జన్మస్థలమైన మహారాష్ట్రలోని త్రయంబకేశ్వరం నుంచి బంగాళాఖాతం వరకు పొంగిపొర్లుతున్నదని సీఎం కేసీఆర్ తెలిపారు. దీనికి తోడు గోదావరి ఉపనదులు కూడా నిండి ప్రవహిస్తున్నాయని చెప్పారు. వర్షపునీరు వాగులు, వంకలు, కుంటలు, చెరువులకు చేరుతోందన్నారు. ఈ నేపథ్యంలో నదులు, ఉపనదులు కూడా ఉప్పొంగుతున్నాయని

మిగతా 2లో..



## భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ ద్విసప్తాహం

వాడవాడాలో పక్షం రోజులపాటు కార్యక్రమాలు

- ఇంటింటా జెండాల ఎగురవేతకు నిర్ణయం
- క్రీడా, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, కవిసమ్మేళనాలు
- ప్రగతిభవన్‌లో అధికారులతో సీఎం కేసీఆర్ సమీక్ష



**హైదరాబాద్,జూలై23:** దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా.. స్వాతంత్య్ర సమరయోధులు, మహనీయుల త్యాగాలు, పోరాట ఫలాలు నేటి తరానికి అర్థమయ్యేలా, దేశభక్తిని ద్విగుణీకృతం చేసేలా రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు రూపొందించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. గడప గడపకూ, వాడ వాడనా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని, క్రీడాపోటీలు, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు, కవిసమ్మేళనాలు, జాతీయ భావాలను రగలించే సాంస్కృతిక కార్యక్రమాలను

మిగతా 5లో..

## మండలాలకు నోడల్ ఆఫీసర్లు

ఎఫ్ఎల్ఎన్ అమలు పర్యవేక్షణకు నియామకం

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన మార్గదర్శకాలు జారీ

**హైదరాబాద్,జూలై23:** ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అమలు పర్యవేక్షణకు మండలానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు క్లస్టర్‌కు సైతం ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించనున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి తొలిమెట్టు పేరుతో ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం ప్రారంభం కానున్నది. ఈ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ నిర్వహణ మార్గదర్శకాలను దేవసేన విడుదల చేశారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలే క్లస్టర్ నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని దేవసేన పేర్కొన్నారు. వీరు వారంలో రెండు రోజుల పాటు 1-5 తరగతుల నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపడతారు.మండల నోడల్ ఆఫీసర్లు తమ పరిధిలోని స్కూళ్లలో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అమలును రెండు నెలల లోపు పూర్తి చేయాలని దేవసేన తెలిపారు.. ఇక క్లస్టర్ నోడల్ ఆఫీసర్లు తమ పరిధిలోని స్కూళ్లను నెలలోపు పూర్తి చేయాలని సూచించారు.

## వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కృషి


- ఆందోళనతో సమయం వృధా చేసుకోవద్దు
- వీఆర్ఏలకు మంత్రి నిరంజన్ రెడ్డి హితవు
- రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏల కలెక్టరేట్ ముట్టడి



**హైదరాబాద్,జూలై23:** రాష్ట్రంలోని వీఆర్ఏల సమస్యలను పరిష్కారిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. వీఆర్ఏల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టిలో ఉన్నాయని, సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారని మంత్రి తెలిపారు.

మిగతా 5లో..

## ప్రజానాడి



# రాజకీయపార్టీలు పక్షపాతధోరణి వీడాలి

మొదటిపేజీ తరువాయి..



హక్కు నేతలకు ఉందని.. కానీ దాని కోసం అందరూ గాంధేయవాదాన్ని అనుసరించాలని సూచించారు. రాష్ట్రపతిగా దేశానికి సేవ చేసుకునే అవకాశం ఇచ్చిన ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయమని కోవింద్ అభివర్ణించారు. పార్లమెంట్ సభ్యులతో కూడిన పెద్ద కుటుంబంలో తాను ఒక భాగమని.. కుటుంబంలో భిన్నాభిప్రాయాలు ఉన్నా దేశ ప్రయోజనాల కోసం పనిచేయాలని సూచించారు.

# భయ పెడుతుంది

మొదటిపేజీ తరువాయి..

ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 8,764.52 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 12,099 .18 క్యూసెక్కుల వరద బయటకు వెళ్తున్నది. మూసీ పూర్తిస్థాయి సామర్థ్యం 645 అడుగులు కాగా.. ప్రస్తుతం 641.25 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు. ఇప్పుడు 3.33 టీఎంసీల వద్ద నీరు నిల్వ ఉన్నది. కాగా, భారీ వరదతో అనంతారం వద్ద మూసి ప్రమాదకరంగా ప్రవహిస్తున్నది. నదిలో 230.5 మీటర్ల వద్ద నీటిమట్టం ఉన్నది. వరద ఉధృతి ప్రమాదకర స్థితిలో ఉన్నదని కేంద్ర జలసంఘం హెచ్చరిం చింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. యాదాద్రి జిల్లాలోని భీమలింగం లో లోలెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీనది పారుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో వానలు దంచికొట్టాయి. శివ్వంపేట మండలంలో కుండపోతగా వర్షం కురుస్తున్నది. భారీ వానతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండగా, కుంటలు, చెరువులు అలుగు పారుతున్నాయి. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వార్షం ధాటికి శివ్వంపేటలో రామాలయం ప్రహరీ గోడ, పురాతన బురుజు గోడ కూలిపోయాయి. మాసాయిపేట మండలంలో హల్దీ ప్రాజెక్టు ఉధృతంగా ప్రవహిస్తుండగా, వెల్దుర్తి చెరువు మత్తడి పారుతున్నది. మెదక్, సంగారెడ్డి జిల్లాలో అతిభారీ వర్షాలు కురిసాయి. గడిచిన 24 గంటల్లో మెదక్ మండలంలో 26.8 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. శివ్వంపేట మండలంలో 21.4 సెంటిమీటర్లు, తుప్రాన్ మండలంలో 19.6 సెంటీమీటర్లు, చిన్న శంకరం పేటలో 19.4 సెంటీమీటర్లు, వెల్దుర్తి లో 17.3 సెంటీ మీటర్లు, నర్సాపూర్‌లో 17.2 సెంటి మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అటు సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 21.4 సెంటీమీటర్లు, ఆందోల్‌లో 15.4 సెంటీమీటర్లు మేర వర్షపాతం నమోదు అయ్యింది.

కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ మండలం కౌలస్ నాలా ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 458 మీటర్లు కాగా ప్రస్తుతం 457.90మీటర్లకు చేరింది. అలాగే ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 1.237 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 1.225. టీఎంసీల నిల్వ కొనసాగుతోంది. ప్రాజెక్టుకు 26,794 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతుండగా... ఔట్ ఫ్లో 27,520 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్ట్ నీరు భారీగా వెళ్తుండడంతో జుక్కల్, బిచ్కుంద, పెద్ద కొడప్ గల్ మండలాల్లోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం వద్ద గోదావరిలో వరద ప్రవాహం మళ్లీ పెరుగుతున్నది. శుక్రవారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండంతో గోదావరిలో క్రమంగా వరద అధికమవుతున్నది. దీంతో భద్రాచలం వద్ద గోదవారి నీటిమట్టం 45.90 అడుగులకు చేరింది. నదిలో 10,48,826 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నది. ఉదయం 8 గంటల సమయంలో గోదావరి నీటిమట్టం 45.60 అడుగుల వద్ద ఉండగా, 10,36,818 క్యూసెక్కుల నీరు ప్రవహించింది. గతవారం గోదావరి పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలతో నది ఉధృతంగా ప్రవహించిన విషయం తెలిసిందే. దీంతో భద్రాచలం వద్ద నీటిమట్టం రికార్డుస్థాయికి చేరింది. నదిలో వరద ఇంకా తగ్గకపోవడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో తాలిపేరు ప్రాజెక్టుకు వరద భారీగా పెరిగింది. దీంతో అధికారులు 25 గేట్లు ఎత్తి 1.99 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక ఇల్లందు సింగరేణి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. కోయగూడెంలో 5.6 సెంటీమీట్ల వర్షపాతం నమోదయింది. దీంతో ఉపరితల గనిలో రాత్రి నుంచి బొగ్గు ఉత్పతి ఆగిపోయింది. వరంగల్ నరగంలోని మండిబజార్‌లో విషాదం చోటు చేసుకుంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలతో శనివారం తెల్లవారుజామున మండిబజార్‌లోని ఓ పురాతన భవనం కూలిపోయింది. శిథిలాలు పక్కనే ఉన్న రేకుల షెడ్డుపై పడటంతో అందులో ఉన్న 60 ఏండ్ల వృద్ధుడు పైడి, ఫిరోజ్ (20) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందారు. సమ్మక్క అనే మహిళ తీవ్రంగా గాయపడింది. సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన మహిళను దవాఖానకు తరలించారు. చనిపోయిన ఫిరోజ్‌కు నేడు నిశ్చితార్థం జరగాల్సి ఉంది. ఈఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, వరదలతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.50 అడుగులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. నీటి నిల్వ 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 202 టీఎంసీలు గా ఉంది. ప్రాజెక్టుకు 81,853 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా.. 57,751 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా ఎడమ గట్టు, కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. శనివారం ఉదయం 11 గంటలకు రేడియల్ క్రేస్ట్ గేట్ల ద్వారా మంత్రి అంబటి రాంబాబు, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి దిగువ నాగార్జునసాగర్ కు నీటిని విడుదల చేశారు. కుడి, ఎడమ గట్ల విద్యుత్ కేంద్రాల్లో కరెంట్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో ప్రాజెక్టులో 882 అడుగుల్లో స్థిరంగా నీటిని నిల్వ చేస్తూ.. మిగులుగా ఉన్న నీటిని స్పిల్ వే గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు.. శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టుల నుంచి నీటిని విడుల చేస్తుండటంతో శ్రీశైలానికి భారీగా ప్రవాహం వస్తోంది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు నదిలోకి రావద్దని సూచించారు. ఇదిలావుంటే రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం రాత్రి శ్రీశైలం చేరుకున్నారు. శ్రీశైల భ్రమరాంబిక అతిధి గృహం వద్దకు చేరుకున్న మంత్రికి అంబటి రాంబాబుకు దేవస్థానం కార్యనిర్వహణాధి కారి ఎస్. లవన్న పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. మంత్రి శనివారం ఉదయం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుకొని జలాశయానికి ప్రత్యేక పూజలు నిర్వహించి డ్యామ్ రేడియల్ క్రస్టు గేట్లు తెరచి దిగువ నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేసారు.



శ్రీశైలం జలాశయం గరిష్ట స్థాయికి చేరడంతో మూడు గేట్లను ఎత్తివేసి వరద నీటిన దిగువకు విడుదల చేశారు. ఏపీ జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో ప్రాజెక్టులో 882 అడుగుల్లో స్థిరంగా నీటిని నిల్వ చేస్తూ.. మిగులుగా ఉన్న నీటిని స్పిల్ వే గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎగువ ప్రాంతంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు జలాశయానికి భారీగా వరద పోటెత్తింది.

తాలిపేరు పూర్తి స్థాయి సామర్థ్యం 7.3లక్షల క్యూసెక్కులు కాగా.. అధికారులు 25 గేట్లను ఎత్తి 1.99 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి విడుదల చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి చింతవాగు, రోటెంత వాగుల తోపాటు తాలిపేరు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. తాలి పేరుకు అనుసంధానమైన చింతవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రాజెక్టులో గంట గంటకు వరద ఉద్ధృతి పెరుగుతోంది. డీఈ తిరుపతి ఆదేశాల మేరకు ఏఈ లు ఉపేంద్ర, శ్రీనివాస్ ప్రాజెక్టు వద్దకు చేరుకొని వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. తాలిపేరు ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చడంతో దిగువ లోతట్టు దోసెలపల్లి మీదుగా ప్రాజెక్టు వరకు ఉన్న రహదారి మీదకు వరద నీరు పోటెత్తింది. దిగువనున్న పగిడి వాగు సైతం ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు మళ్లీ మునుగుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వచ్చిన భారీ వరదలు నుంచి ఇంకా తెరుకోక ముందే తాలిపేరులో వరద ఉద్ధృతి భారీగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. తాలిపేరు ప్రాజెక్టుకు వరద భారీగా పెరగడంతో లోతట్టు గ్రామాలైన జీదండుపేట, కేశవాపురం, గొంపెనగూడెం గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## తెలంగాణలో కొత్తగా.. 13 మండలాలు

మొదటిపేజీ తరువాయి..

ఆదేశించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పలు జిల్లాల్లో కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు కొత్త మండలాలకు సంబంధించిన ఉత్తర్వులను ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపారు. ప్రజా ఆకాంక్షలు, స్థానిక ప్రజా అవసరాలను పరిశీలించి మరికొన్ని మండలాలు ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ జిల్లాల్లో నూతన మండలాల ఏర్పాటుకు రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఉమ్మడి నిజామాబాద్‌లో కొత్తగానాలుగు మండలాలు ఏర్పటు కానున్నాయి. నారాయణపేట జిల్లాలో గుండుమల్, కొత్తపల్లె మండలాలు ఏర్పాటు కానున్నాయి. వికారాబాద్ జిల్లాలోని తాండూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో దుద్యాల్ మండలం కానుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కౌకుంట్ల మండలం ఏర్పాటు కానుంది.

నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆలూర్, డొంకేశ్వర్ కొత్త మండలాలు కానున్నాయి. జిల్లాలోని బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో సాలూర మండలం ఏర్పాటు కానుంది. మహబూబాబాద్ జిల్లాలో సీరోల్, నల్గొండ జిల్లాలో గట్టుప్పల్ మండలాలు కొలువు తీరనున్నాయి. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ పరిధిలో నిజాంపేట్ మండలంగా మారనుంది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో డోంగ్లి మండలం ఏర్పాటు కానుంది. జగిత్యాల జిల్లాలో జగిత్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎండపల్లి, కోరుట్ల డివిజన్ పరిధిలో భీమారం మండలాలు ఏర్పాటు కానున్నాయి. అభ్యంతరాలకు 15 రోజులు..: కొత్త మండలాల ఏర్పాటుకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిపై 15 రోజుల్లోగా అభ్యంతరాలు, వినతులను సంబంధిత జిల్లాల కలెక్టర్లకు అందించాల్సి ఉంటుంది. వాటన్నింటినీ పరిశీలించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ తుది నోటిఫికేషన్ జారీ చేయనుంది. అయితే.. మునుగోడు నియోజకవర్గంలో గట్టుప్పల్ మండలం ఏర్పాటు చేయాలని స్థానికులు చాలా రోజుల నుంచి డిమాండ్ చేస్తున్నారు. అయితే.. ఆ నియోజకవర్గం నుంచి గెలుపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం ఖాయమనే వార్తలు రెండు రోజులుగా జోరుగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ ఉప ఎన్నిక వచ్చే అవకాశాలు సైతం ఉన్నాయంటూ మీడియా కోడై కూస్తోంది. దీంతో అప్రమత్తమైన సీఎం కేసీఆర్ మునుగోడుపై ఫోకస్ పెంచారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి మంత్రి జగదీశ్ రెడ్డితో ఈ విషయంపై చర్చలు జరిపారు.

ఈ నేపథ్యంలోనే మునుగోడు నియోజకర్గంలో చేపట్టాల్సి ఉన్న అభివృద్ధి పనులు, పెండింగ్ లో ఉన్న ప్రజల డిమాండ్లపై ఫోకస్ పెంచాలని మంత్రికి సీఎం సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే చిరకాల డిమాండ్ అయిన గట్టుప్పల్ మండలం ఏర్పాటుకు సైతం గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. నిన్న ఓ మీడియాతో మాట్లాడిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఈ రోజు సాయంత్రంలోగా గట్టుప్పల్ మండలంపై ప్రకటన రాబోతుందంటూ చెప్పారు. సీఎం కేసీఆర్ ఉప ఎన్నిక కోసమే ఈ మండలాన్ని ప్రకటించబోతున్నారంటూ ఆయన అన్నారు. ఆయన చెప్పినట్లుగా ఈ రోజు గట్టుప్పల్ మండలం ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి ప్రకటన రావడం గమనార్హం.

## గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా మంకీపాక్స్

మొదటిపేజీ తరువాయి..

ఆరోగ్య సంస్థ అత్యవసర కమిటీ సమావేశాన్ని నిర్వహించింది. మంకీపాక్స్ ను గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించాలా..? వద్దా..? అనే అంశంపై చర్చింది. తాజాగా శనివారం రోజు గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీని డిక్లేర్ చేసింది. ప్రపంచానికి మంకీపాక్స్ ను పెనుముప్పుగా డబ్ల్యూహెచ్ఓ పరిగణిస్తోంది. వైరస్ మరింత వ్యాప్తి చెందకుండా డబ్ల్యూహెచ్ఓ కీలక చర్యలు తీసుకోనుంది. అయితే గత నెలలో గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా మంకీపాక్స్ ను ప్రకటించేందుకు డబ్ల్యూహెచ్ఓ నిరాకరించింది.. అయితే గత వారం నుంచి గణనీయంగా కేసుల సంఖ్య




పెరగడంతో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాల్సి వచ్చింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 75 దేశాల్లో 16,000 పైగా కేసులు నమోదు అయ్యాయి. జూన్ చివరి నుంచి జూలై ప్రారంభం వరకు ఏకంగా కేసుల సంఖ్య 77 శాతానికి పెరిగింది. ఇటీవల భారత్ లో కూడా మూడు మంకీపాక్స్ కేసులు వెలుగులోకి వచ్చాయి. గల్ఫ్ కంట్రీస్ నుంచి కేరళకు వచ్చిన ముగ్గురిలో వైరస్ ను గుర్తించారు. యూకేలో ప్రారంభం అయిన మంకీపాక్స్ కేసులు క్రమంగా యూరోపియన్ దేశాలకు వ్యాపించింది. ఇతర దేశాల్లో కూడా కేసులు క్రమంగా వెలుగులోకి వస్తున్నాయి. ఒక్క యూరపియన్ దేశాల్లోనే 86 శాతానికి పైగా మంకీపాక్స్ కేసులు నమోదు అయ్యాయి. అమెరికాలో 11 శాతం కేసులు ఉన్నాయి. ఇటీవల పలు అధ్యయనాల్లో 95 శాతం కేసులు శృంగారం ద్వారానే సంక్రమిస్తుందని తేలింది.

## నేడు హైదరాబాద్‌లో బోనాల జాతర

**రెండ్రోజుల పాటు వైన్‌షాపుల మూత**

హైదరాబాద్,జూలై23: బోనాల సందర్భంగా గ్రేటర్ పరిధిలో మద్యం దుకాణాలకు సెలవు ప్రకటిస్తూ.. హైదరాబాద్ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ఆది, సోమవారాల్లో వైన్ షాపులు పూర్తిగా బంద్ కానున్నాయి. బార్ అండ్ రెస్టారెంట్ లు కూడా మూతపడనున్నాయి. మంగళవారం యధావిధిగా తెరుచుకోనున్నాయి. దీంతో మందుబాబులు మద్యం దుకాణాల వైపు పరుగులు తీసారు. ముందుగానే బాటిళ్లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో వైన్స్ షాపుల ముందు విపరీతమైన రద్దీ నెలకొంది. అక్రమంగా మద్యం విక్రయిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. నగరంలో ఉన్న మద్యం దుకాణాలను నిశితంగా పరిశీలించడంతో పాటు నిఘా ఉంటుందన్నారు. ఇదిలావుంటే శాలిబండ హరిబౌలిలోని అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయంలో భక్తులు నైవేద్యాలు సమర్పించనున్నారు. సోమవారంతో వేడుకలు ముగుస్తాయి. ఇక



బోనాల విషయానికి వస్తే... ఆషాఢ మాసంలో ఈ పండుగను నిర్వహించుకుంటుంటారు. తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో ప్రతి ఆదివారం ఒక్కొక్క ప్రదేశంలో బోనాల జాతర జరుగుతుంటుంది. తెలంగాణ సంస్కృతికి తలమానికంగా భావించే ఈ బోనాలు తొలుత గోల్కొండలో జూన్ 30న బోనాలు ప్రారంభమయ్యాయి. జూలై 17న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ అమ్మవారి బోనాలు జరిగాయి. జూలై 24న భాగ్యనగరంలో వివిధ ప్రాంతాల్లో బోనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జూలై 25న దేవాలయాల్లో ఘట్టాల ఊరేగింపు అట్టహాసంగా జరుగనుంది. జూలై 28న గోల్కొండలో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. లాల్ దర్వాజ మహంకాళి బోనాలు జరుగనున్నాయి.


## అతిగా వ్యవహరిస్తున్న మీడియా

### కోర్టులకన్నా ముందే తీర్పులు ఇచ్చేస్తోంది

### అపరిపక్వ చర్చల ద్వారా ప్రజాస్వామ్య అపహాస్యం

**రాంచీలో జరిగిన ఓ కార్యక్రమంలో చీఫ్ జస్టిస్ రమణ**

రాంచీ,జూలై23: ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాపై చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ ఫైర్ అయ్యారు. జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మీడియా కంగారు కోర్టులను నడిపిస్తోందని ఆరోపించారు.



కొన్ని కేసుల్లో అనుభవజ్ఞులైన జడ్జిలు కూడా ఇవ్వలేని తీర్పులను మీడియా ఇస్తోందని ఆయన అన్నారు. అపరిపక్వ చర్చల ద్వారా ప్రజాస్వామ్య ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నారని రమణ ఆరోపించారు. అతి దూకుడు, బాధ్యతారాహిత్యం వల్ల మన ప్రజాస్వామ్యాన్ని రెండు అడుగులు వెనక్కి తీసుకువెళ్తున్నట్లు మీడియాపై చీఫ్ జస్టిస్ సీరియస్ అయ్యారు. ప్రింట్ మీడియా ఇంకా కాస్త జవాబుదారీగా వ్యవహరిస్తోందని, కానీ ఎలక్ట్రానిక్ మీడియా మాత్రం జీరో జవాబుదారీతనంతో ఉందని ఎన్వీ రమణ అన్నారు. ఇటీవల కాలంలో న్యాయమూర్తులపై భౌతికదాడులు పెరుగుతున్నాయని, ఎటువంటి రక్షణ లేకుండానే జడ్జిలు సమాజంలో జీవించాల్సి వస్తోందన్నారు. రాజకీయవేత్తలు, అధికారులు, పోలీసు ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులకు రిటైర్మెంట్ తర్వాత కూడా సెక్యూర్టీ కల్పిస్తున్నారని, కానీ జడ్జిలకు ఇదే తరహా రక్షణ లేకుండాపోయిందన్నారు. నిర్ణయాత్మక కేసుల్లో మీడియా విచారణ సరైంది కాదన్నారు. బేధాభిప్రాయాలను ప్రచారం చేస్తున్న మీడియా.. ప్రజల్లో వైరుధ్యాన్ని పెంచుతోందన్నారు. దీంతో ప్రజాస్వామ్యం బలహీనపడుతోందన్నారు. ఇది వ్యవస్థను దెబ్బతీస్తోందన్నారు. ఈ క్రమంలో న్యాయవ్యవస్థపై పెను ప్రభావం పడుతోందన్నారు. సోషల్ మీడియా పరిస్థితి మరీ దారుణంగా ఉందని సీజే అన్నారు. స్వీయ నియంత్రణతో మీడియా ఉండాలని ఆయన కోరారు. పదాలను మీడియా జాగ్రత్తగా వాడాలన్నారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలు బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ప్రజలను విద్యావంతులను చేసేందుకు, చైతన్యపరిచేందుకు ఎలక్ట్రానిక్ మీడియా తన గళాన్ని వాడుకోవాలని సీజే రమణ సూచించారు.

## మోడీ విధానాలతో దేశభద్రతకు ముప్ప

**ఆర్మీ స్కిల్స్ చంపేసేలా అగ్నిపథ్ పథకం**
**మండిపడ్డ కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

హైదరాబాద్,జూలై23: ప్రధాని మోదీ విధానాలతో దేశ భద్రతకు ముప్పు అని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్మీ స్కిల్స్ చంపేసేలా అగ్నిపథ్ పథకం ఉందని దుయ్యబట్టారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మోదీ నిర్ణయాలు త్రివిధ దళాలను బలహీనపరుస్తున్నాయని తప్పుబట్టారు. అగ్నిపథ్ ద్వారా త్రివిధ దళాల్లో సైన్యం బలగాన్ని తగ్గిస్తున్నారని మండిపడ్డారు. ఏడాదికి ఆర్మీలో రిక్రూట్‌మెంట్స్‌ను 60 వేల నుంచి 40 వేలకు తగ్గించారని విమర్శించారు. అగ్నిపథ్ ద్వారా ఆర్మీలో 40 వేలు, నేవీలో 3 వేలు, ఎయిర్‌ఫోర్స్‌లో 3 వేల పోస్టులు ఇస్తున్నారని తెలిపారు. కావాల్సిన సైనిక బలానికి అనుగుణంగా రిక్రూట్‌మెంట్ చేయాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. నిరుద్యోగం పెరగడం వల్లే అగ్నిపథ్ స్కిమ్‌లో రిజిస్టర్ చేసుకుంటున్నారని తెలిపారు. నాణ్యతా శిక్షణలో రాజీపడొద్దన్నారు. పాత విధానంలోనే సైనిక రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. తొలిసారి ఒకే సమయంలో చైనా, పాక్‌తో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని, చైనా సరిహద్దు చర్యలను మోదీ పట్టించుకోకపోవడం దురదృష్టమని వ్యాఖ్యానించారు. సరిహద్దుల్లో చైనా గ్రామాలు నిర్మిస్తున్నా కేంద్రం పట్టించుకోవట్లేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు.

## తాజా వర్షాలతో గోదావరి మరింత ఉధృతం

మొదటిపేజీ తరువాయి..

పేర్కొన్నారు. మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. మొన్నటి వరదల కంటే ఎక్కువగా వరదలు సంభవించే ప్రమాదం ఉందని సీఎం హెచ్చరించారు. ఇప్పుడు కురిసే వానలతో ఎల్లుండి వరకు గోదావరి ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందన్నారు. ప్రమాద హెచ్చరికలను దాటి నది ప్రవహించే అవకాశం ఉన్నందున, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజాప్రతినిధులు, అధికారులు అప్రమత్తంగాఉండాలని కేసీఆర్ హెచ్చరించారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ మొన్నటి మాదిరిగానే వరద ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్న నేపథ్యంలో.. ఇది అధికార యంత్రాంగానికి పరీక్షా సమయం లాంటిందని కేసీఆర్ పేర్కొన్నారు. కష్టకాలంలో ప్రజలను కాపాడుకునేందుకు సంబంధిత అన్నిశాఖల అధికారులు వారి ఉద్యోగ కేంద్రాలను వదిలి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదని ఆదేశించారు. ఈ మేరకు తక్షణమే సర్క్యులర్ జారీ చేయాలని సీఎస్ సోమేశ్ కుమార్‌ను సీఎం ఆదేశించారు. వైద్యశాఖ, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్ అండ్ బీ, మున్సిపల్, మిషన్ భగీరథ తదితర శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు యంత్రాంగాన్ని కిందిస్థాయి పోలీస్ స్టేషన్ల వరకు ఎస్ఐ, సీఐలతోపాటు, పోలీసు సిబ్బందిని హెడ్ క్వార్టర్స్ వదిలి వెళ్లకుండా ఆదేశాలు జారీ చేయాలని డీజీపీని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. ఈ సందర్భంగా నీటిపారుదలశాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గోదావరి ప్రవాహాన్ని, శ్రీరాంసాగర్ నుంచి కడెం వరకు ప్రాజెక్టుల పరిస్థితులను, వరదలు ఎట్లా వస్తున్నాయనే విషయాలను సీఎం కేసీఆర్‌కు వివరించారు. భారీ వర్షాలతో గోదావరి నదీ ప్రవాహం, ఎస్సారెస్పీ, కడెం నుంచి వస్తున్న వరదను, గంట గంటకూ మారుతున్న వరద పరిస్థితిని శాటిలైట్ ఆధారంగా రికార్డు చేసే విధానాన్ని ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ కుమార్ సీఎంకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వాతావరణ హెచ్చరికలను ఆధారం చేసుకొని, కురవబోయే భారీ వర్షాల వల్ల సంభవించే వరదను ముందుగానే అంచనా వేస్తే.. లోతట్టు ముంపు ప్రాంతాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు చర్యల కోసం ఈ టెక్నాలజీని వినియోగించుకోవచ్చని రజత్ కుమార్ వివరించారు. వాతావరణ శాఖ వానలను అంచనా వేస్తున్నదని, కానీ తద్వారా వచ్చే వరద ముప్పును పసిగట్టలేక పోతున్నదని, ఈ టెక్నాలజీతో వరద ముప్పును కూడా అంచనా వేయవచ్చని రజత్ కుమార్ తెలిపారు. హైదరాబాద్ నగరంలోని వర్షాలు, వరదలు, చెరువుల పరిస్థితిపై మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, జలమండలి ఎండీ దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్ తదితరులను అడిగి సీఎం వివరాలు తెలుసుకున్నారు. సమీక్షలో మంత్రులు హరీష్ రవు, ప్రశాంత్ రెడ్డి, సిఎస్ సోమేశ్ కుమార్, డిజిపి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సీఎస్ శనివారం జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో కురుస్తున్న క్రమంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున వరదలు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో అన్ని రిజర్వాయర్లు, చెరువులు పూర్తిగా నిండినందున చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. రహదారులు, వంతెనలు దెబ్బతిన్న మార్గాల్లో వాహనాల రాకపోకలను నిలిపివేయాలని చెప్పారు. పోలీసు, నీటిపారుదల, రోడ్లు భవనాలు, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖలన్ని సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో వర్షాలు, వరదలపై సీఎం కేసీఆర్ ఆరా తీశారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో ఫోన్లో మాట్లాడిన సీఎం%ొూ% ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, వరద ముంపునకు గురయ్యే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరో 24 గంటల పాటు అవసరమైన అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన చోట యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని చెప్పారు.

## శాతవాహన హై స్కూల్ లో బోనాల వేడుకలు



**జగిత్యాల జూలై 23 (ప్రజా మంటలు) :** స్థానికి శాతవాహన హై స్కూల్ లో బోనాల వేడుకల సందర్భంగా, విద్యార్థు తమ ఆటపాటలతో ఆకట్టుకొన్నారు. వివిధ వేశాధారణతో, అందమైబీనా బోనాలు కుండల్తో పిల్లలు తెలంగాణ సంస్కృతిని కళ్ళకు కట్టినట్లు చూపారు. నిర్వాకులు శ్రీపాద శామ్ సుందర్ అధ్వర్యంలో, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి ,షాది ముబారక్ దేశానికి ఆదర్శం

**-రూ. 44 లక్షల కళ్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**
**సి ఏం సహాయ నిధి అందజేత ఒక పుణ్య కార్యక్రమం - మంత్రి కొప్పుల**

**ధర్మపురి జూలై23 (ప్రజా మంటలు) :** కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ పథకం దేశానికి



ఆదర్శం అని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ గారు అన్నారు. ధర్మపురి క్యాంపు కార్యాలయం లో 44 మంది కి కళ్యాణ లక్ష్మీ రూ.44,05లక్షలు, 36 మందికి సిఎం సహాయ నిధి రూ.14,99,లక్షల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళ్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ పథకం అనేది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలో పుట్టిందని, నిరు పేద ఆడపడుచులకు పెద్దన్నయ్య ల అండగా ఉంటున్నారని, టీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు. మహిళల ప్రభుత్వ కార్యక్రమాలను ఉపయోగించుకుని, మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని సూచించారు.

## వరదల్లో చిక్కుకున్న చీటూర్ గ్రామస్థులు

**సహాయ చర్యలు చేపట్టిమ ఎన్‌డిఆర్ఎఫ్ రిస్క్యూ ఆపరేషన్ బృందం**

**లింగాల ఘనపురం జూలై 23 (ప్రజామంటలు):** భారీ వర్షాల వల్ల జనగామ జిల్లా



లింగాల ఘనపూర్ మండలం చీటూర్ గ్రామానికి చెందిన 14 మంది గ్రామస్తులు (10 మంది మహిళలు, 4 గురు పురుషులు) శుక్రవారం సాయంత్రం వరదల్లో చిక్కుకున్నారు. ఎటు వెళ్ళలేక అక్కడే ఉండిపోయిన వారిని సమాచారం అందుకున్న ఎన్‌డిఆర్ఎఫ్ రెస్క్యూ ఆపరేషన్ బృందం శనివారం ఉదయం కాపాడి బయటకు సురక్షితంగా తీసుకువచ్చారు. రాత్రి నుండి సహాయక చర్యలు పర్యవేక్షించిన ఆర్డీఓ మోహన్, ఏసిపి రఘుచందర్, సీఐ వినయ్ కుమార్, ఎస్.ఐ. రఘుపతి, వీరేందర్ ఉన్నారు.

## బిజెపి మండల స్పోర్ట్స్ కన్వీనర్ నక్క సంపత్

**తరిగొప్పుల నర్మెట్ట జులై 23 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ధారవత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అగపేట గ్రామానికి చెందిన నక్క సంపత్ ని మండల స్పోర్ట్స్ కన్వీనర్ గా ఏకీగ్రవంగా ఎన్నుకోవడం జరిగింది. మోడీ సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో తీసుకెళ్లడానికి, మండలంలో స్పోర్ట్స్ లో అన్ని గ్రామాల యువకులను ఇన్వాల్వ్ చేసి మండల జిల్లా స్థాయిలో తీసుకెళ్లడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి సోక్కంఅనిల్ కుమార్, బిజెపి మండల ఉపాధ్యక్షులు చిర్రా తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిలు నాగభూషణం శర్మ, తోకల శేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షులు పోలు రాజు, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు కొర్ర సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.



**వీఆర్ఏ లకు మద్దతుగా సిపిఎం, సిఐటియు, తెలంగాణ రైతు సంఘం,**

## అక్రమ అరెస్టుకు ఖండన

**జనగామ జూలై 23 (ప్రజామంటలు):** వీఆర్ఏలకు సిపిఎం సిఐటియు తెలంగాణ రైతు సంఘం మద్దతు ప్రకటించి అక్రమ అరెస్టు తీవ్రంగా ఖండించారు. గత మూడు



రోజు నుండి వీఆర్ఏలకు నిండు అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లాలో ఉన్న వీఆర్ఏలు పే స్కేల్ ప్రకారం వేతనాలు పెరిగిన ధరణకు అనుగుణంగా శాంతి యుతంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తుండగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోకి వస్తున్న జిల్లా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కలిసే ప్రయత్నం చేయడంతో పోలీస్ శాఖ అత్యుత్సాహం ప్రదర్శించి వీఆర్ఏలపై పిడుగులు గుద్ది లాఠీ చార్జి చేసి అరెస్టు చేయడం సరైన పద్దతి కాదని నాయకులు అన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు, తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భూక్య చందు నాయక్ మద్దతు తెలిపి మాట్లాడారు.

## రాష్ట్ర ప్రభుత్వం గొర్ల కాపర్లకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలి

**కురుమల విజ్ఞప్తి**

**హైదరాబాద్ 23 జూలై (ప్రజా మంటలు) :** రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, మంత్రులు హరీష్ రావు, కేటీఆర్,తలసాని శ్రీనివాస్ యాదవ్ లు కురుమలైన గొర్ల కాపర్లకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రాష్ట్ర కురుమలు, కురుమ సంఘం నాయకులు కోరుతున్నారు. ప్రకృతి విలయ తాండవానికి గొర్ల కాపర్లు అతులాకుతలం అవుతూ కంటినిండా కనుకు కరువై గొర్లను ఎంత కాపాడుకుందామన్న ప్రయోజనాలు లేకుండా పోతోందని గొర్ల కాపర్లు కన్నీటి పర్వంతమైనారు. ప్రధానంగా జీవాలు పోషణ మీద ఆధారపడి జీవిస్తున్న గొర్ల కాపర్లు గత 15,20 రోజుల నుంచి రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు తో,నదులు ఉప్పొంగి ప్రవహించడం,ఎక్కడికి వెళ్లడానికి వీలు లేకుండా పరిస్థితులు నెలకొని ఉండడం తో బాధలు వర్ణనాతీతం పరిణమించాయి. గొర్లు పడిన పిడుగులు మరణించడం,రోడ్డు ప్రమాదంలో మరణించడం, వాగులలో కొట్టుకుని పోవడంతో ఇత్యాది కారణాలతో దారూణానికి,తీరని నష్టానికి గుర్రైనామని ఒక్కొక్కరి కాపర్లు బాధలు దిక్కు తోచని విధంగా అంతాఇంతా కాదు. ఇదిలాఉండగా మూగజీవాలకు కనీసం తిండి,మంచి నీళ్ళు లేని పరిస్థితులు ఉన్నాయని కరీంనగర్ కొత్తపల్లి కురుమ సంఘం నాయకుడు చిటుకూరు శ్రీనివాస్ కురుమ,గొర్ల కాపర్లు సంఘం ఉపాధ్యక్షుడు మాకల పోచమల్లు కురుమ,నంగి కొమురయ్య కురుమ,పెద్ది మురళీధర్ కురుమ,కూకట్ల శీను కురుమ, యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు ఎం కురుమ సంఘం నేతలు జెట్ట యాదగిరి కురుమ,జెట్ట కార్తిక్ కురుమ,ఉప్పల్ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు చౌదరిపల్లి పర్వాతాలు కురుమ, తదితరులు ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో గొర్ల కాపర్లు బాధలు వివరించారు. నిండా మునిగిన పంటచేలతో రైతులతో పాటు గొర్ల కాపర్లు ఎదుర్కొంటున్న బాధలు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి మంత్రులు తక్షణం ఆర్థికంగా ఆదుకోవాలని వర్షం నుండి రక్షణకు దుస్తులు,తార్పాలిన్ సీట్లు అలాగే పశు



గ్రాసం అందించాలని ఆయా నేతలు,గొర్ల కాపర్లు సంఘం నేతలు కోరుతున్నారు.మరి ఇప్పటికైనా ప్రభుత్వం మంత్రులు స్పందించి ఆదుకుంటారని మీడియా ప్రతినిధులు కూడా కోరుతున్నారు.

## అధికారులు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలి

**జనగామ జూలై 23 (ప్రజామంటలు):** భారీ వర్షాల వలన ఎటువంటి ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో చెరువుల వద్ద నీటిపారుదల శాఖ అధికారులు సిబ్బందిని రైతులను సమన్వయ పరుస్తూ అప్రమత్తం చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్టం నివేదికలను త్వరితగతిన అందించాలని, ఇంజనీరింగ్ అధికారులు చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వైద్యాధికారులు సిబ్బంది సమయపాలన పాటించాలని ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో వైద్యం అందజేయాలన్నారు. విద్యుత్ అధికారులు అంతరాయాలు లేకుండా చూడాలని గ్రామాలలో అందుబాటులో ఉండాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు ట్యాంకులను శుభ్రపరచాలని స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలన్నారు. మున్సిపాలిటీలలో అధికారులు నిరంతరం పారిశుధ్యం మెరుగుపరుస్తూ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కోవిడ్ బూస్టర్ డోస్ లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉన్నామని కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు. దేవరుప్పుల మండలంలో అధిక వర్షపాతం నమోదయింది అన్నారు. చెరువులు సమృద్ధిగా నిండాయని అలుగు బారుతున్నాయని అధికారు లు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సిబ్బంది అందుబాటులో ఉంటూ మురుగు కాలువలు పరిశుభ్రపరచాలని నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో ప్రజలను అప్రమత్తం చేస్తూ సకాలంలో వైద్యం అందే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివలింగయ్య



మాట్లాడుతూ.... భారీ వర్షాలు నేపథ్యంలో అధికారులు అప్రమత్తం చేయడం జరిగిందని ఇటువంటి ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తు న్నామన్నారు. వైద్యాధికారులు అందుబాటులో ఉన్నారని శానిటేషన్ పనులు విస్తృతంగా చేపడుతున్నామని, జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు భాస్కరరావు, అబ్దుల్ హమీద్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి డిఆర్డిఏ పిడి రాంరెడ్డి ఆర్డీవో లు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఎ ల అక్రమ అరెస్టు ను ఖండించిన సాదం రమేష్

**చిల్పూర్ జులై 23 (ప్రజామంటలు):** మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో సాదం రమేష్ మాట్లాడుతూ గత మూడురోజుల నుండి జనగాం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు విఅర్ఎ లు రిలే నిరాహారదీక్షలు చేపట్టుతుంటే తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కలెక్టర్ ఆఫిసు కు వచ్చినప్పుడు విఆర్ఎ, ల సమస్యలు పరిష్కారం కోసం వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నం చేస్తుంటే అట్టి మంత్రి ని కలువకుండ పోలీస్ లు విఅర్ఎ లను అడ్డుకొని అక్రమంగా అరెస్ట్ లు చేయడం ఖ%శీ%డిస్తున్న. ఎందుకంటే గతంలో వారు రిలే నిరాహార దీక్షలు. ధర్నాలు చేపట్టితే అసెంబ్లీ లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... పేస్కెల్ 55 సంవత్సరాలు పైబడిన వారికీ వారసులకు ఉద్యోగం. అర్హత కలిగిన విఅర్ఎ లకు ప్రమోషన్. ఉద్యోగ భద్రత. సమస్యలపైన ప్రకటన చేసి 2017 లో మరియు ప్రగతి భవన్ లో పేపర్ ప్రకటనలు చేసి మూడు సంవత్సరాలు గడుస్తున్నా విఅర్ఎ ల సమస్యలు పరిస్కారంచకుండ వారు ఉద్యమం చేసినప్పుడల్ల మోసపురితమైన మాటలు చెప్పుకుంటు దాట వేస్తున్నారు. వారు దీక్షలకు కూర్చున్న క్రమంలో తహసీల్దార్ కార్యాలయం స్కూల్. కాలేజీలకు సర్టిఫికెట్ లు, కళ్యాణ లక్ష్మి, రైతులకు ఉన్నటువంటి సమస్యలు చాలా పెండింగ్ పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి వారి న్యాయమైన డిమాండ్స్ ను పరిస్కారం చేసి ప్రజల ఇబ్బందులు పడకుండ చూడాలని సిపిఎం చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్ అన్నరు. గ్రామాలలో భారీ వర్షలు కురస్తున్నాయ్. నష్టపోయిన పంటలను. అంచనా వేసి పత్తి, మొక్కజొన్న పంటలకు వెంటనే రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశాడు.



**తెలంగాణ ప్రభుత్వ హాస్టళ్ల గురుకుల పాఠశాలల**


## ఫుడ్ కాంట్రాక్టులను వెంటనే రద్దు చేయాలి

**జనగామ జూలై 23 (ప్రజామంటలు):** గత నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ గురుకుల పాఠశాలల విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కి గుర్రై హాస్పిటల్లో చికిత్స పొందిన సంఘటనలు రోజు రోజుకు పెరుగుతుండడంతో గురుకుల పాఠశాల అన్ని ప్రభుత్వ హాస్టళ్ల ఫుడ్ కాంట్రాక్టర్ల కమిషన్ కక్కుర్తి, విద్యార్థుల ప్రాణాపాయ స్థితికి కారణమైతుందని జిల్లా అధ్యక్షులు అభి గౌడ్ అన్నారు. జిల్లా కమిటీ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెరాస నాయకులకు సంబంధించిన ప్రభుత్వ గురుకుల పాఠశాలల ఫుడ్ కాంట్రాక్టులను అప్పగించడంతో కమీషన్లకు కక్కుర్తి పడి నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడంతో, ఆ కలుషిత ఆహారం తిన్న విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కు గుర్రైన సంఘటనలు రాష్ట్రంలో, జిల్లాలలో రోజురోజుకు పెరుగుతున్నాయని అన్నారు. కాంట్రాక్టులను రద్దు చేయకుండా ఏడాది కాలం మొత్తం కొనసాగించడం విద్యార్థులకు ప్రమాదకరమని, భవిష్యత్తులో అన్ని గురుకుల పాఠశాలల ఫుడ్ కాంట్రాక్టులల్లో జరిగిన అవకతవకలను ఆధారాలతో సహా బట్టబయలు చేస్తామని, వెంటనే సంబంధిత కాంట్రాక్టులను రద్దు చేయ్యాలని డిమాండ్ చేశారు.



## చెరువు ను తలపిస్తున్న మోడల్ స్కూల్ ప్రాంగణం

**హుస్నాబాద్ జూలై 23 (ప్రజా మంటలు):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ స్కూల్ ప్రాంగణం చెరువును తలపించిన ఘటన స్థానికంగా చోటు చేసుకుంది. మోడల్ స్కూల్ ప్రాంగణంలో నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మోడల్ స్కూల్ ప్రాంగణం మొత్తం నీరు నిలిచి పోయింది. వర్షాకాలం కావడంతో నీరు నిలిచిపోయిన ప్రదేశాలలో క్రిమి కీటకాలు చేరి వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నాయి. మధ్యాహ్న భోజన సమయంలో నీటి నిల్వ కారణంగా దుర్వాసన వ్యాప్తి చెందడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. కావున సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో నీరు నిలిచి ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



## నిరుపయోగంగా ఉన్న సులభ్ కాంప్లెక్స్

**ఎల్కతుర్తి జూలై 23 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి బస్టాండ్ లో 3




సంవత్సరాల క్రితం మరమ్మతులు చేసిన సులబ్ కాంప్లెక్స్ నేటి వరకు నిరుపయోగంగా పడి ఉంది. బస్టాండ్ లో వచ్చే ప్రజలు ముఖ్యంగా ఆడవారు బాత్రూంలో వెళ్లడానికి సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఇకనైనా చొరవ తీసుకుని తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారు.



జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్, జడ్పీ చైర్పర్సన్ దావ వసంత-సురేశ్, మున్సిపాల్ చైర్పర్సన్ బోగ శ్రావణి ప్రవీణ్, ప్యాక్ ఛైర్మన్ లు పోతారం సాగర్ రావు, బీర్పూర్ రామచందర్ రావు, జగిత్యాల మహిపాల్ రెడ్డి

## వరద ప్రాంతాలను పర్యటించిన సిపిఐ

**పరిస్థితులపై కలెక్టర్ కు వినతిపత్రం**

**జనగామ జూలై 23 (ప్రజామంటలు):** జనగామ సీపీఐ, బికెఎంయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా జనగామ పట్టణములో జ్యోతి



నగర్ కాలనీ, బాలాజీ నగర్, కుర్మవాడ, దేవి టాకీస్ వెనక మొదలగు ప్రాంతాలు పర్యటించారు. ముంపుకు గుర్రై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, బికెఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి జనార్ధన్, పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జనగామ జిల్లా కలెక్టర్ శివలింగయ్య కు వినతిపత్రం అందజేశారు. తదుపరి వారు మాట్లాడుతూ.... ప్రభుత్వ అధికారులు స్థానిక ఎమ్మెల్యే ముత్తి రెడ్డి యాదగిరి రెడ్డి, ఈ ప్రజల ఇబ్బందులు కనబడటం లేదని, కమీషన్ లు వచ్చే వాటికి మాత్రం ముందుంటారని అరోపించారు.

## పెంబర్తి జాతీయ రహదారిపై చాముండి మద్యం షాపు వెంటనే తొలగించాలి

**జనగామ జూలై 23 (ప్రజామంటలు):** పెంబర్తి జాతీయ రహదారిపై చాముండి మద్యం షాపు వెంటనే తొలగించాలని జనగామ జిల్లా జెఎసి నాయకులు ఆసర్ల సుభాష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జనగామ జిల్లాలో పెంబర్తి గ్రామంలో ప్రమాదకరంగా మారిన జాతీయ రహదారిపై చాముండి మద్యం షాపు పెట్టిన స్థలంలో యుట్న్ ఉండటం వల్ల చాలా ప్రమాదాలు జరిగి ఇప్పుటికే 3 గురు మరణించారని, చాలా మంది గాయాల పాలైనారని అన్నారు. ఆ స్థలంలో వైన్స్ పెట్టకుండా చర్యలు తీసుకోవాలని జనగామ జిల్లా ఆబ్కారీ సూపరింటెండెంట్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. ప్రజల ప్రాణాల కన్నా మద్యం అమ్మకాలే ముఖ్యమని మద్యం షాపుకి అనుమతి ఇచ్చారని, మద్యం షాపు పెట్టిన తర్వాత మద్యం తాగిన వ్యక్తులు రోడ్డు దాటే క్రమంలో వాహన దారులని ఇబ్బందికి గురి చేసి, ప్రమాదాలు జరగడానికి కారణం అవుతున్నారని అరోపించారు. అక్కడి నుండి చాముండి వైన్స్ వెంటనే తొలగించాలని ఆసర్ల సుభాష్ డిమాండ్ చేశారు.





జనగామ జిల్లా లింగాల ఘనపూర్ మండలం కుందారం గ్రామం నుండి రెడ్డిపురం వయా బానాజిపెట్ వెళ్ళే మార్గంలో వర్షాల వల్ల రోడ్డు తెగి ప్రవహిస్తున్న నీరు

# రైతుల ఉసురు తీస్తున్న వానలు !

వానల రాకడతో ప్రకృతి కొత్త ఊపిరి పోసుకుంటోంది. అయితే అతి వర్షాలు మనలను ఊపిరి సలపకుండా చేస్తున్నాయి. దీనికంతటికీ వాతావరణ మార్పులే కారణం.ప్రకృతి విధ్వంసం ఇలాగే కొనసాగుతూ పోతే మనం విపరీత పరిణామాలనే ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకు తాజా వరదలు,వర్షాలను ఉదాహరణగా చూడాలి. ప్రజలు, పాలకులు కలసి ఇందుకు బాధ్యత వహించాలి. మొన్నటి ఎండాకాలం భరించరానంత వేడిమితో ఉక్కపోసింది. ఇప్పటికీ యూరోప్ దేశాలు అల్లాడి పోతున్నాయి. ఎండల వేడిమికి తాళలేక పోతున్నారు. ఇదంతా కూడా ప్రకృతి ప్రకోపంగానే చూడాలి. అతిగా ఎండలు, అతిగా వర్షాలు, అతిగా చలి అన్నవి మానవులుతమకుతాము సృష్టించుకున్న వైపరీత్యాలు తప్ప మరోటి కాదు. ఇకపోతే గ్రామాల్లో గొలుసుకట్టు చెరువుల మాయయ్యాయి. నగరాల్లో కాంక్రీట్ జంగల్స్ విస్తరించాయి. ఈ కారణంగా వాన చినుకు పడగానే అది వరదలా పారుతోంది. మొత్తానికి ఈ యేడు తొలకరి జల్లులతో వర్షాకాలం వచ్చేసింది. ఉక్కపోతతో ఊపిరి సలపనివ్వకుండా ఉడుకెత్తించిన వాతావరణం చల్లబడింది. అంతేనా అంటే ఇవేమి వర్షాలు అన్న స్థాయికి చేరాం. నింగి నుంచి వానధార నేల మీదకు జలజలా జారుతుంటే వ్యాపించే మట్టి పరిమళంతో కలిగే ఆనందమే వేరు. గ్రామాల్లో కూడా మట్టిపరిమళాలు పోయాయి. కంపు వాసనలు, ప్లాస్టిక్ వ్యర్థాల రవాణాతో గ్రామాల్లో వరదలా పారుతున్నాయి. వర్షాల వల్ల కలిగే హర్షాతిరేకాలకు, వర్షాల వల్ల కలిగే విషాదాలకు అందరి కంటే ఎక్కువగా స్పందించేది రైతులే! ప్రకృతినే నమ్ముకుని బతికే కష్టజీవులు వాళ్లు. వర్షాలు సకాలంలో కురిస్తే పొంగిపోతారు. అతిగా కురిస్తే కుంగిపోతారు. ఇప్పుడు పడుతున్న వర్షాలతో రైతులు కుంగిపోతున్నారు. వేసిన విత్తనం వృథా అయ్యింది. పంటలు నాని పోయాయి. విత్తనం మొలకెత్తని దశకు చేరుకుంది. ప్రకృతి ధర్మంలో భాగంగా రుతుపవనాలు బలంగా రావడంతో బలమైన వర్షాలు పడడం మొదలయ్యింది. గోదావరితీరం కన్నీటిసంద్రంగా మారింది. జడివానలు మొత్తం రైతాంగాన్ని దెబ్బతీసాయి. సామాన్యులను కట్టుబట్టలు లేకుండా చేశాయి.వర్షాలు సకాలంలో సజావుగా కురిస్తే, అందరికీ హర్షదాయకమే! కురవాల్సిన సమయంలో వానలు కురవకున్నా, కురవరాని సమయంలో తెరిపి లేకుండా కురిసినా కన్నీళ్లు తప్పవు. అతిగా కురిసే వర్షాలు తెచ్చే విషాదాలు అంతాఇంతా కాదు. అక్కడక్కడా శ్రుతిమించి మితిమీరిన వానలు వరదలతో ముంచెత్తుతుంటాయి. అంతమాత్రాన వర్షాలను వద్దనుకోలేం. వర్షాలే లేకపోతే ఈ భూమ్మీద జీవమే ఉండదు. వానలు సక్రమంగా పడాలంటే భూమ్మీద వాతావరణం సరిగా ఉండాలి. అందుకే పర్యావరణ పరిరోణ మన ప్రధాన లక్ష్యం కావాలి. ఇటీవలి వర్షాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతులను ,ప్రజలను కోలుకోలేని దెబ్బకొట్టాయి. ఆంధ్రాలో అనేకచోట్ల అధిక వర్షాలతో చేలలో నిలిచిన నీరు బయటకు తోడి రైతులు వరినాట్లు వేస్తున్నారు. వర్షాలకు నారుమడులు మునిగాయి. కొన్నిచోట్ల తిరిగి నారు పోయగా మరికొన్ని చోట్ల ఆలస్యంగా నాట్లు వేస్తున్నారు. అధిక వర్షాల కారణంగా వరదనీరు చేరడంతో లోతట్టు ప్రాంతాల్లో వరిచేలు నీట మునిగాయి. ఇలా వారంరోజుల పాటు కురిసిన భారీవర్షాలకు ఇరు రాష్ట్రాల రైతాంగం చావు దెబ్బతింది. జిల్లాల్లో ప్రధాన పంటలన్నీ భారీ విస్తీర్ణంలో తుడిచి పెట్టుకపోయాయి. వేల ఎకరాలకుపైగా పత్తి పంట నీటి మునిగి మొక్కలు చనిపోగా కొన్నివేల ఎకరాల్లో కంది, ఇతర పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. వేలాది మంది రైతులు ప్రభుత్వ చేయూత కోసం ఆశగా ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది ఆరంభంలోనే వర్షాలు



కురియడంతో రైతాంగం కోటి ఆశలతో ఉత్సాహంగా పత్తి పంట సాగు చేపట్టింది. మొక్కలు మొలచి ఏపుగా పెరుగుతున్నాయనుకుంటున్న దశలో విరుచుక పడ్డ అతివృష్టి కారణంగా రైతులు ఒక్కొక్క ఎకరాపై రూ.15వేలకుపైగా నష్టపోయారు. ప్రస్తుతం మళ్లీ పంటలు నాటే పరిస్థితి కూడా లేదని రైతులు చెబుతున్నారు. ఒక వేళ పంటలు వేయాలనుకున్నా కంది, పెసర వంటి పప్పు దినుసులు, ఇతర చిరుధాన్యాల మినహా పత్తి సాగు చేసే పరిస్థితి లేదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితులకు తగ్గట్టుగా పత్తి జూన్ మొదటి వారం నుంచి జూలై రెండవ వారం లోపు మాత్రమే విత్తుకోవాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే ఆశించిన పంట దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు. అలా కాకుండా మొండిగా కొంతమంది రైతులు మళ్లీ పత్తి సాగు చేయాలని ఆలోచిస్తే మాత్రం దిగుబడులు తగ్గటమే కాకుండా తెగుళ్లు, చీడపీడల ఉధృతి తట్టుకోవటం కష్టమని నిపుణులు చెబుతున్నారు. వర్షాల కారణంగా రెండు రాష్ట్రాల్లోనూ వేలాదిమందికిపై కౌలురైతులు ప్రభావితమైనట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రస్తుతం వీరంతా కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే వాస్తవిక నష్టం ఎంత..? ఎంత మంది రైతులు ప్రభావితమయ్యారు..? నష్టపోయిన విలువ ఎంత..? అనే వివరాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సాధికారిక సర్వే జరపాల్సి ఉంది. ఇప్పటి వరకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవటంతో నష్టం అంచనా సర్వే ఇంకా ప్రారంభించనే లేదు. అటు రైతులకు సమాధానం చెప్పలేక, ఇటు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాక వ్యవసాయాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇదిలా ఉండగా పంటలు నష్టపోయిన దాదాపు వేలాది మంది రైతులు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడు లన్ని వరదనీటిలో కొట్టుకుపోయాయి. బ్యాంకు రుణాలు అందక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి పంటలు సాగుచేశామని రైతులు వాపోతున్నారు. గత రెండు,మూడు సంవత్సరాల నుంచి నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించడం లేదని తెలంగాణ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి మాత్రం భిన్నంగా నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను వెంటనే ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని రైతాంగం కోరుతోంది. వర్షాలవల్ల నష్టపోయిన పంటలస్థానంలో మళ్లీకొత్తగా ఆ పంటలను సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్.

# చిట్టి బుర్రలో గట్టి ప్రశ్నలు

ఐదవ తరగతి చదువుతున్న కీర్తి వాళ్ళ అమ్మతో కలిసి కూరగాయల సంతకు వెళ్ళింది . అక్కడ దుకాణం ముందు పారవేసిన చెత్తను ఎత్తడం గురించి ఇద్దరు వ్యక్తులు గొడవ పడుతున్నారు . "అమ్మా! వాళ్ళు చాలా చెడ్డవాళ్ళు కదమ్మా " అని గొడవపడుతున్న వాళ్ళను చూసి అంది కీర్తి . ఎందుకలా అనుకుంటున్నావు అంది వాళ్ళ అమ్మ . దుకాణం ఎదురుగా చెత్త పారవేయడమే కాక అలా కొట్టుకుంటున్నారంటే చెడ్డవాళ్ళు అనే కదా అని కాస్త గట్టిగా చెప్పింది కీర్తి . కీర్తి మాటలు దుకాణం పక్కనే ఉన్న మనిషి విని వీళ్ళ వైపు తిరిగి చూశాడు. అతనేమంటాడో అని కీర్తి వాళ్ళ అమ్మ కాస్త కంగారుపడింది . అతను కీర్తిని చూసి చిన్నగా నవ్వేసరికి హమ్మయ్య అనుకుంది .కీర్తిని కొంచెం సమాధానపరచడానికి చూసి " మనుషులందరూ మంచి వాళ్ళే కీర్తి ! కొన్ని సమయాల్లో వారి ప్రవర్తన వాళ్ళ చేతుల్లో ఉండదు.కాలమే వారిని చెడుగా ప్రవర్తించేలా చేస్తుంది' అని చెప్పింది అమ్మ . తనకిష్టమైన మొక్కజొన్న కంకులు కనపడగానే కీర్తి దృష్టి అటు వైపు వెళ్ళిపోయింది . తమకు కావాల్సినవి కొనుక్కుని ఇంటిదారి పట్టారు తల్లీకూతురు .

ఇంటికెళ్లాకా చెల్లెలితో ఆడుకుంటూ బొమ్మలకు కీర్తి గొడవపడుతుంటే అమ్మ కీర్తిని పిలిచి " చెల్లెలు నీకన్నా చిన్నది కదా! దానితో గొడవ పడకుండా చక్కగా ఆడుకోవాలిగానీ కొట్టుకుంటారా ? ఇలా చేస్తే అందరూ మిమ్మల్ని చూసి వీళ్ళు మంచి పిల్లలు కాదు" అంటారు అని మందలించింది వాళ్ళ అమ్మ . " అమ్మా ! నేను కావాలని అలా చేయలేదు. కాలమే నాతో అలా అల్లరి చేసేలా చేసింది" అని ఠక్కున అంది కీర్తి .ఇందాక సంతలో చెప్పిన సంగతి గుర్తుపెట్టుకుని ఇలా సమాధానం చెప్పిందని తల్లికి అర్థమయ్యింది .

కీర్తి సమయస్ఫూర్తికి మనసులోనే మెచ్చుకున్నా " నీకు రాముడు కథ చాలా ఇష్టం కదా ! అందులో తండ్రికి ఇచ్చిన మాట కోసం రాముడు అడవులకి



వెళ్లి చాలా కష్టాలు పడ్డాడు . అలా కాకుండా తండ్రి మాట లెక్కచేయకుండా ఉండి ఉంటే ఈ కష్టాలన్నీ పడేవాడు కాదు " అని తల్లి చెప్తుండగా మధ్యలో ఆపి కీర్తి " అలా చేయడం తప్పు కదా మరి ? " అంది . "రాముడికి ఎదురయినట్టుగానే అందరికి మంచి చెడు రెండు దారులు ఉంటాయి .మనం ఏది ఎంచుకోవాలో మన చేతిలోనే ఉంటుంది . మంచి దారిలో నడవడం ఎప్పుడూ కష్టంగానే ఉంటుంది " అని ఇంకా ఎదో చెప్పబోతున్న తల్లిని మళ్ళీ ఆపి " హీరో ఎంత పెద్ద కష్టాన్ని దాటితే అంత గొప్పవాడవుతాడు" అని సినిమాలో డైలాగ్ చెప్పేసరికి తల్లి నవ్వుతూ " శ్రీరాముడు ఎన్ని యుగాలైనా గొప్పవాడే! అందుకే మనందరికీ ఇష్టమైన దేవుడయ్యాడు " అంది. కీర్తికి ఇష్టమైన రాముడిని ఉదాహరణగా చెప్పేసరికి కాస్త సమాధానపడింది. మర్నాడు ఆ చిట్టి బుర్ర వేసే గట్టి ప్రశ్నలకు సిద్ధమవుతూ నిద్రపోయింది తల్లి.

డా.చేరుకుపల్లి హారిక
9000559913

# వరద తగ్గినా ఇంట్లోకి అడుగు పెట్టలేని దుస్థితి

## బురదలో కూరుకుపోయిన అనేక ఇళ్లు

## కొట్టుకుపోయిన పశువుల కోసం వెతకులాట

## ఇంట్లో సామాన్లు చెత్త కుప్పలా మరిన వైనం

కాకినాడ,జూలై23( : గోదావరి జిల్లాలను కదిలిస్తే కన్నీటి సంద్రాలు కనిపిస్తున్నాయి. సర్వం కోల్పోయిన ప్రజలు దీనావస్థలో ఉన్నారు. సొంతూళ్లకు చేరుకుని తమగూడు చూసుకుని బోరుమంటున్నారు. ఊహించని రీతిలో వచ్చిపడిన వరద శోకాన్ని మిగిల్చింది. వరద తగ్గినప్పటికీ ఇళ్లల్లోకి అడుగుపెట్టే పరిస్థితి లేదు. వరద ఉధృతికి ఇళ్లు నేలకొరిగి, పైకప్పులు కొట్టుకుపోయి, ఇళ్లల్లో నడుములోతు బురద పేరుకుపోయి ఇలా ఊళ్లన్నీ నామరూపాల్లేకుండా పోయాయి. ఇళ్లల్లో తడిసి ముద్దయిన సామాగ్రి ఎందుకుపనికి రాకుండా చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. టీవీలు, కూలర్లు, ఫ్యాన్‌లు తడిచి ఎందుకు పనికి రాకుండా పోయాయి. కట్టుబట్టలతో పునరావాసానికి తరలివెళ్లి ఇప్పుడు వరద తగ్గాక ఇంటికి వచ్చి చూస్తే ఆ కట్టుబట్టతో మిగిలిన కుటుంబాల రోదన అంతాఇంతా కాదు. ఈ నష్టాన్ని ఎలా పూడ్చుకోగలమంటూ లబోదిబోమంటున్నారు. కోళ్లు, మేకలు ఇతర పశువులు అడ్రస్ లేకుండా పోయి వరద నష్టాన్ని రెట్టింపు చేశాయి. వాటి జాడకోసం రైతులు కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. భారాన్ని భాదని మోసుకుంటూ ఇళ్లల్లో పేరుకుపోయిన బురదను తొలగించే పనిలో బాధితులు నిమగ్నమయ్యారు. సాయమంటూ ప్రభుత్వం ఇచ్చిన రూ.2 వేలు తమకు జరిగిన నష్టాన్ని ఏమాత్రం తీర్చగలదని బాధితులు పెదవి విరుస్తున్నారు. గోదావరికి వరదలు వచ్చి పంట పొలాలు ముంపుబారిన పడిన నేపథ్యంలో ఆ పంటలన్నీ కుళ్లిపోవడంతో వరదనీరు తగ్గుముఖం పడుతుండడంతో నష్టాలు తేలుతున్నాయి. రావులపాలెం మండలంలోని గౌతమి, వశిష్ఠపాయల నదీపరివాహక ప్రాంతంలోని లంకపొలాలన్నీ వరదనీటితో ముంచెత్తాయి. వరద తగ్గుముఖం పట్టడంతో ఇప్పుడిప్పుడే పంటపొలాలు తేలుతున్నాయి. లంక పంట పొలాల్లో సాగుచేసిన మునగ, బొప్పాయి, కూరగాయల పాదులు, ఉద్యానపంటలు పూర్తిగా నీటమునగడంతో కుళ్లిపోతున్నాయి. నేటివరకు కాగితరూపంలో లెక్కలే తప్ప అధికారులెవరూ పంటనష్టనమోదుకు చర్యలు తీసుకోకపోవడంతో రానున్న రోజుల్లో సాగు చేసేదెలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైనతేయ వరద నీరు తగ్గి పలు ఇళ్లు కుప్పకూలుతున్నాయి. బోడసకుర్రు పల్లిపాలెంలో ఆరు ఇళ్లు నేలమట్టం కాగా మరికొన్ని ఇళ్లు ఒరిగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కుమ్మరికాల్వ కౌశిక డ్రెయిన్ పొంగి అల్లవరం బుడంపేటలో 60 ఇళ్లు, సడక్‌రోడ్డు సిద్దినవారి మెరకలో 15 ఇళ్లు ముంపులో చిక్కుకున్నాయి. గోపాయిలంక అవుట్‌ఫాల్ స్లూయిస్ తలుపులు తెరుచుకోక ఈముంపు తగ్గడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అల్లవరం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై తూరలు కుంగి ప్రమాదం పొంచి ఉంది. గోదావరికి వరద తీవ్రత తగ్గుముఖం పట్టి నప్పటికీ లంక గ్రామాల ప్రజలకు పాట్లు తప్పడంలేదు. అప్పనపల్లి ఉచ్చులవారిపేటకు వెళ్లే రహదారిలో గల కాజ్ వేపై వరద తీవ్రత ఇంకా ఎక్కువగా ఉండడంతో వాహన దారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అక్కడ ఇంకా మోకాలుదాటి వరద ప్రవహిస్తుంది. అప్పనపల్లి కాజ్‌వేపై కూడా ఇంకా వరదనీరు ప్రవహిస్తుం డడంతో పడవ ప్రయాణాలు తప్పడం లేదు,



పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల్లో వరద తగ్గుముఖం పట్టడంతో వరద ప్రభావానికి రోడ్లన్నీ ధ్వంసమై రాళ్లు లేచిపోయి అధ్వానంగా తయారయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో గల కాయగూరల పాదులు ఇంకా వరద నీటిలోనే తేలుతున్నాయి. పదిరోజుల పాటు వరద నీటిలో మునిగి ఉండడంతో తమకు అపార నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాడబోది మీడియం డ్రెయిన్ పొంగి పొర్లడంతో ఆదుర్రు, పాశర్లపూడిలంక, బాడిలంక ప్రాంతాల్లోని డ్రెయిన్ పక్కనగల నివాస గృహాలన్నీ ముంపు బారినపడ్డాయి. మామిడికుదురులోని ఎస్టీ కాలనీలోకి పక్కనేఉన్న మురుగు కాల్వలో నీరు చేరడంతో కాలనీ మురుగుమయమైంది.

# తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం కేవి రంగారెడ్డి

## జూలై 24... కేవి రంగారెడ్డి వర్ధంతి

తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం ఆయన. తెలంగాణ కోసం నెహ్రూతో సైతం ఢీకొనడానికి వెనుకాడనని ప్రాంతీయ అభిమాని. పదవీ త్యాగానికి వెన్ను చూపని త్యాగశీలి. చేయాలను కున్నది ఎన్ని అడ్డకుంలెదురైనా చేసిన ధీశాలి. నిజాం వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా పోరాడి జైలుకు కూడా వెళ్ళిన పోరాట యోధుడు.

1950లోనే ఆయన తెలంగాణ వాదం వినిపించారు. నిజాం పాలన, ఆ తర్వాత మిలిటరీ గవర్నర్ పాలన, వెల్లోడి పాలనలో మహారాష్ట్రులదే పైచేయి ఉండటాన్ని ఆయన నిరసించారు. దీన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో ఒక బహిరంగ సభ కూడా పెట్టారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బూర్గులను నిలిపి గెలిపించింది కూడా ఆయనే. ఆయనే కొండా వెంకట రంగారెడ్డి. ఆంధ్ర ప్రదేశ్ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ప్రముఖ న్యాయవాదిగా, పలు సంస్థల వ్యవస్థాపక బాధ్యునిగా ఆయన బహుముఖ సేవలు అందించిన నేతగా చరిత్రలో నిలిచి పోయారు.

కొండా వెంకట రంగారెడ్డి (డిసెంబరు 12, 1890 – జూలై 24, 1970) స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తొలితరం రాజకీయ నాయకులు. ఆయన పేరు మీదుగానే రంగారెడ్డి జిల్లాకు ఆ పేరు వచ్చింది. రంగారెడ్డి ప్రస్తుత రంగారెడ్డి జిల్లా తెలంగాణ రాష్ట్రం లోని మొయినాబాదు మండలం, పెద్దమంగళారం గ్రామంలో 1890, డిసెంబరు 12 న జన్మించారు.

1959 నుండి 1962 వరకు దామోదరం సంజీవయ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈయన ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. రంగారెడ్డి, నీలం సంజీవరెడ్డి మంత్రివర్గములో కూడా మంత్రి పదవి నిర్వహించారు. అయన నైజాం శాసనసభలో, హైదరాబాదు రాష్ట్ర శాసనసభలోనూ, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో ప్రాతినిధ్యం వహించారు. 1936లో ఆయన శాసనసభకు ఎన్నిక కావడంతో ప్రజలకు సేవ చేసే అవకాశం కలిగింది. సభలో 24 శాసనాలను, కొన్ని సవరణలు ప్రవేశపెట్టారు. అందులో స్త్రీలకు వారసత్వపు హక్కు కలిగ జేయడం, వర్ణాంతర వివాహం చేసుకుంటే వారి సంతానం సక్రమ సంతానమని నిరూపణ, బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలన, అస్పృశ్యతా నివారణ, జాగీర్ల రద్దు, ఉద్యోగాల నియామకానికి పబ్లిక్ సర్వీసు కమిషన్ ఏర్పాటును తన రెండేళ్ల పదవి కాలంలో చేయగలిగారు.

కేవీ రంగారెడ్డి పూర్తి పేరు కొండా వెంకట రంగారెడ్డి. ఆయన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల తాలుకాలోని పెద్ద మంగళారంలో 1890 డిసెంబరు 12న కొండా చెన్నారెడ్డి, బుచ్చమ్మ దంపతులకు జన్మించారు. ఉన్నత విద్యను అభ్యసించారు. కేవీ రంగారెడ్డి మనస్సు ఎప్పుడూ అనాధరణకు గురైన స్త్రీల దుర్గతిపైన, దళితుల, పేదల ఆర్థిక దుస్థితిపైన ఉండేది. దీన్ని ఎలాగైనా రూపుమాపాలని అనుకునేవారు. స్త్రీ తన భర్త చనిపోగానే ఎలాంటి ఆస్తి లేకుండా నిరాధరణకు గురయ్యేది. అలాగే నిమ్న జాతుల వారు కూడా నిరాధరణకు గురయ్యేవారు. జాగీరుదారులకు, పేద రైతులక మధ్య వివాదాలు వచ్చినపుడు పేదల పక్షాన నిలిచేవారు. పేదల పక్షాన ఉచితంగా




వాదించేవారు. రంగారెడ్డి ఆంధ్ర మహాసభ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని మహబూబ్ నగర్ జిల్లా షాద్‌నగర్లో జరిగిన ఐదవ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు.

హైదరాబాద్‌లో అనేక సాంఘిక, సాంస్కృతిక సేవాసంస్థల ఆవిర్భావంలో ప్రధాన పాత్ర పోషించారు. 1940 వరకు జిల్లా కోర్టు, హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. 1943లో జరిగిన ఏడవ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. అంతేకాదు సాహిత్యాభివృద్ధి కోసం1943లో ఆవిర్భవించిన ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయం, శ్రీవేమన భాషా నిలయం స్థాపనకు తోడ్పడ్డారు. హింధీ ప్రచార సభకు, గోలకొండ పత్రికకు, రయ్యత్ పత్రికకు చేయూత నందించారు. నిజాం సంస్థానం భారత్‌లో విలీనం అయిన తర్వాత బూర్గుల మంత్రి వర్గంలో రెవెన్యూ, ఎక్సైజ్, కస్టమ్స్ తదితర శాఖలను నిర్వహించారు.

నాటి ముఖ్యమంత్రి బూర్గులను ఏ కారణం లేకుండానే ముఖ్య మంత్రిగా రాజీనామా చేయాలని కోరినపుడు ఆ నిర్ణయాన్ని కేవీ తీవ్రంగా వ్యతిరేకించారు. అంతే కాకుండా మేం మళ్లీ బూర్గులనే సీఎంగా ఎన్నుకుంటే మీరేం చేస్తారని నిలదీసిన ధీరుడు. 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత కూడా నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గంలో హోం శాఖ, రెవెన్యూ శాఖలను నిర్వహించారు. 1960లో నీలం సంజీవరెడ్డి అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా వెళ్లగా ఇక్కడ ముఖ్యమంత్రి పదవిని దామోదరం సంజీవయ్యను వరించింది. ఆయన కాలంలో రంగారెడ్డి ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి ఆయన మేనల్లుడు.

ఏనాడు ఏ విషయంలోనూ రాజీపడని మనస్తత్వం కొండాది. సంస్థానంలో మహారాష్ట్రులకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌ను పెట్టినా, తెలంగాణ ప్రాంతం నుంచే ముఖ్యమంత్రిని ఎంపిక చేయించినా, విశాలాంధ్రకు వ్యతిరేకత వ్యక్తం చేసినా అన్ని సదరు అదరక బెదరక చేసేవారు. చాలా వరకు పేదలకు ఉచితంగా పనులు చేసి పెట్టేవారు. విద్యార్థి దశలో తాను ఎదుర్కొన్న కష్టాలను పేద విద్యార్థులెవరూ ఎదుర్కొన కూడదనే ఉద్దేశంతో రెడ్డి హాస్టల్ కట్టించారు. బాలుర పాఠశాల, ఆంధ్రసరస్వతి, బాలికల పాఠశాల, రెడ్డి బాలికల హాస్టల్, ఆంధ్ర విద్యాలయం మొదలైన వాటిని కట్టించారు. 1970, జూలై 24 న రంగారెడ్డి మరణించారు. ఆయన స్మృత్యర్థం 1978, ఆగస్టు 15న హైదరాబాదు జిల్లాను విభజించి నూతనంగా ఏర్పడిన జిల్లాకు రంగారెడ్డి జిల్లా అని పేరుపెట్టారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# 29న గొల్లప్రోలులో సిఎం జగన్ పర్యటన

## ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే దొరబాబు

రాజమండ్రి,జూలై23 : గొల్లప్రోలు పట్టణంలో ఈనెల 29వ తేదీన ముఖ్యమంత్రి జగన్ పర్యటించనున్నారు. ఈ మేరకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణ శివారులోని ప్రైవేటు లేఅవుట్ స్థలంలో బహిరంగ సభ ఏర్పాటుకు వీలుగా చదును, ఎత్తు చేసే పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో నిలిచిపోయిన వర్షపునీటిని తొలగించి క్వారీ డస్ట్ వేశారు. సభకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించారు. వేదిక నిర్మాణపనులు జరుగుతున్నాయి. పనులను పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని హెలీపాడ్ వద్ద పనులు ప్రారంభమయ్యాయి. పాఠశాల ఆవరణలో నాడు నేడు పనులు నిమిత్తం వేసిన ఇసుక, ఇతర సామాగ్రి హెలికాప్టర్ దిగే సమయంలో అడ్డంకిగా ఉండే అవకాశం ఉందని పరిశీలించాలని జిల్లా కలెక్టరు అధికారులకు సూచించారు. డీఈవో పాఠశాలకు చేరుకుని వాటిని పరిశీలించారు. వీటివలన ఎటువంటి అడ్డంకి ఉండదని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు పట్టణంలో 29వ తేదీన జరగనున్న సీఎం పర్యటనను అడ్డుకుని నిరసన తెలుపుతామని మాలమహాగర్జన అధ్యక్షుడు దానం లాజర్‌బాబు చెప్పారు. పిఠాపురం పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల సంక్షేమానికి సంబంధించిన 28 పథకాలను రద్దు చేశారని తెలిపారు. దళితులకు చేసిన అన్యాయంపై దళితవాడల్లో పాదయాత్ర నిర్వహించి అవగాహన కల్పించామని చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వంలో స్పందన లేకపోవడం, దళితులపై దాడులు పెరగడం తదితర అంశాలపై తమ నిరసన తెలిపేందుకు ముఖ్యమంత్రి పర్యటన అడ్డుకోవాలని భావిస్తున్నామని వివరించారు.



# కేశవపట్నం మండలంలో బలమున్నవారిదే రాజ్యమా?

## కన్నతల్లి సంతకం ఫోర్జరీ చేసిన పెద్ద కొడుకు

## అత్యుత్సాహం చూపిస్తున్న పోలీసులు.. న్యాయం కోసం ఓ తల్లి ఆవేదన ..

హైదరాబాద్ జులై 23 (ప్రజా మంటలు) : – రెడ్డి సులోచన హైదరాబాద్ మీర్ పేట లో ఉంటారు. సొంత ఊరు గద్దపాక, కేశవపట్నం మండలము కరీంనగర్ జిల్లా. ఆమెకి ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు విద్యాధర్ రెడ్డి, చిన్న కొడుకు శశిధర్ రెడ్డి. చిన్న కొడుకు 2005 లో ఉద్యోగ రీత్యా అమెరికా వెళ్లి సంపాదిస్తూ, ప్రతినెలా డబ్బులు తల్లి బ్యాంక్ అకౌంట్ కి డబ్బులు పంపించేవారు. పెద్ద కుమారుడు తల్లి కి తెలియకుండ, తానే ఇంటి బాధ్యతలు చూసుకుంటూ అని, మభ్య పెట్టి ఏటీఎం కార్డ్ తన దగ్గరే పెట్టుకుని, ప్రతి రోజు డబ్బులు డ్రా చేస్తూ, మోసం చేసి 8 సంవత్సరాలలో 50 లక్షల దాకా వాడుకున్నాడు. తల్లికి తెలిసి 2019 లో నిలదీయగా, ఆస్తి మొత్తం తనకే కావాలని తల్లిని మానసికం గా శారీరకం గా హింసించడం మొదలు పెట్టాడు.

తరువాత తల్లి కి తెలియకుండా పెళ్లి చేసుకొని, వేరు కాపురం పెట్టుకున్నడు. బయట నుంచి ఇంటికి వచ్చి రోజు కొడుతూ, భూతులు తిడుతూ, ఊరిలో ఉన్న 4 ఎకరాల పొలం తన పేరున పట్టా చేయమని హింసించేవాడని తల్లి ఆవేద్న వ్యక్తం చ్చించేసింది. ఈ క్రమంలో ఒకసారి, ఇంట్లో ఆమెని తిడుతూ చీర కొంగుతో ఉ రివేసి చంపే ప్రయత్నం కూడా చెయ్యబోయ్యాడు. ఈ విషయం సీసీ కెమెరాలో రికార్డ్ అవ్వడంతో, ఆ రికార్డ్ ఆధారంగా మీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో తల్లి ఫిర్యాదు చేయగా ఎఫ్.ఐ.ఆర్.463/2019 కేస్ బుక్ చేశారు. పోలీస్ వారి ముందు మంచిగా నటించి అరెస్ట్ చేయకుండా చూసుకున్నడు, పోలీస్ వాళ్ళు కూడా సొంత కొడుకు పైన కేసు ఏమిటని తల్లికి సర్ది చెప్పారు తల్లి కూడా సరే అని ఉరుకున్నారు.

దొంగతనంగా దస్తావేజులు ఎత్తుకెళ్లడు.

హైదరాబాదులో కేస్ అయిందని గద్దపాక వచ్చి, తల్లి లేని సమయంలో ఇంటి తాళాలు తీసుకొని బీరువాలో ఉన్న ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్స్, తల్లి పేరున ఉన్న భూమి పట్టా పాస్ బుక్కులు ఎత్తుకొని వెళ్ళాడని, ఈ విషయమై కేశపట్నం పోలీస్ స్టేషన్ నందు రాతపూర్వక ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు ఎంక్వయిరీ చేస్తామని, కేసులో ఏ విధమైన యాక్షన్ తీసుకోకపోవడంతో తల్లి రిజిస్టర్ పోస్టు ద్వారా కేశవపట్నం పోలీసువారికి కమిషనర్ వారికి ఫిర్యాదు చేశారు. ఐనా ఫలితం లేకపోవడంతో, హుజురాబాద్ కోర్టు నందు సివిల్ కేసు ఫైల్ చేపిం, తల్లి బతికున్నంత వరకు ఆస్తులు భూములు అనుభవించే హక్కు తల్లికే ఉ ండాలని కోర్టు ద్వారా పర్మినెంట్ ఇంజక్షన్ ఇవ్వమని, కోరి, టెంపరరీ ఇంజక్షన్ ఆర్డర్ తీసుకొన్నామని ఆమె తెలిపారు.

అయిన కూడా పెద్ద కొడుకు, విద్యాధర్, అయిన పులికోట విద్యానందం, సురేష్ వాసా, లంకుస్, మాజీ ఎంపీటీసీ పరశు రాములు, మాజీ సర్పంచ్ బసవయ్య, కొమురయ్య, దేవునూరి భాగ్యమా, అజయ్ ఇంకా కొందరు గ్రామస్తులతో కుమ్మక్కై చిన్న కొడుకు శశిధర్ జూన్ 30వ తారీఖున ఒక పెళ్లి నిమిత్తం అమెరికా నుంచి వచ్చి, జులై 13 తేదీన అంతా కలిసి గద్దపాక



తనను బెదిరిస్తూ దౌర్జన్యంగా పొలం దున్నుకుంటున్నారని, ఈ విషయమై కేశవపట్నం పోలీసులకి ఎమ్మార్వో కి ఫిర్యాదు చేసినప్పటికీ ఏ విధమైన చర్య తీసుకోకపోవడంతో ఈ విషయంలో కోర్టు ధిక్కరణ కేసు కూడా వేసియారు.

జైల్లో ఉన్నా బుద్ధి రాలేదు

ఊరిలో తల్లిపై దౌర్జన్యం చేసినందుకు హైదరాబాద్ ఏసిపికి ఫోన్ చేసి చెప్పగా, విద్యాధర్ నీ అరెస్టు చేసి రంగారెడ్డి కోర్టు నందు రిమాండ్ చేసి చర్లపల్లి జైలులో 14 రోజులు ఉన్నాడు. మళ్లీ ఒక సంవత్సరం తర్వాత దేవుని కొమురయ్య భాగ్యమ్మ మా ఊరి సర్పంచు గోపు విజయకుమార్ నీ ఇంటి మీద తీసుకొచ్చి ఎస్సీ వారికి భూమి రిజిస్ట్రేషన్ చేయాలి అని గొడవ చేస్తూ తల్లి పైన ఎస్సీ ఎస్టీ కేసులు పెడతానని బెదిరించారు.

2009 సంవత్సరంలో రాసినట్టున్న ఒక తెల్ల కాగితం పైన 102 సర్వేనెంబర్ లోని తల్లి పేరును ఉన్న రెండెకరాల ఏడు గుంటల భూమిని తల్లి విద్యాధర్ కలిసి అమ్మినట్టు, తల్లి భర్త తమ్ముడు నరేందర్ రెడ్డి సాక్షి సంతకంతో మరికొందరు సాక్షుల సంతకంతో దొంగ పత్రం సృష్టించారు. ఆ సంతకం నేను పెట్టలేదు. నాకు సంతకం తో సంబంధం లేదని తల్లి వెంటనే పోలీసు స్టేషన్లో, నా సంతకం ఫోర్జరీ చేశారని విద్యాధర్, నరేందర్ రెడ్డి, దేవి నూరి కొమరయ్య, భాగ్యమ్మ వారి పైన ఫిర్యాదు చేసినా పోలీసు వారు ఏ విధమైన యాక్షన్ తీసుకోకపోవడంతో హుజురాబాద్ కోర్టు లో మళ్ళీ ప్రైవేట్ కంప్లైంట్ వేసి ఫోర్జరీ ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయించారు.

తమపైనే తప్పుడు కేసులా ?

ఇంకా ఆమె తన ఆవేధనను ఇలా తెలిపింది. వెళ్లాము. 15వ తేదీన శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకి కేశవపట్నం పోలీస్ స్టేషన్ కి వెళ్ళాము., ఫోర్జరీ కేసు రిపోర్టు వచ్చినందున ఫోర్జరీ పరీక్షల నిమిత్తం మేము ఇచ్చిన ఇంటి పత్రాలు తిరిగి ఇవ్వమని అడిగాము. ఎస్ఐ చంద్రశేఖర్ ఫోర్జరీ కేసు ఫైనల్ కాలేదని ఆర్డర్ రాలేదని చెప్పారు. మేము ఫోర్జరీ చెయ్యలేదు అని కోర్టులో ప్రూఫ్ అయిందని అడగగా, ఏమీ లేదని చెప్పారు.

16 వ తారీకు పొద్దున్న విధ్యదర్ పంపించారని భూమి రిజిస్టర్ చేయండి, ఫోర్జరీ కేసు లేదు, ఎం లేదు, అని దేవునూరి భాగ్యమ్మ, ఆమె భర్త కొమురయ్య మా ఇంటి పైకి గొడవకి వచ్చారు. మేము బయటకి రాలేదు. 100 కి డయల్ చేసి పోలీస్ కి పిలిచే క్రమం లో భయపడి వెళ్ళిపోయారు. 17వ తేదీ ఉదయం పోలీస్ వారు మా ఇంటి వచ్చినపుడు, కులం పేరుతో దూషించామని తప్పుడు కేసు పెట్టి కొన్ని పత్రికలలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. అది చూసి మేము వెంటనే కరీంనగర్ సీపీని కలిసాము. వారు హుజురాబాద్ ఏసిపి కి రిఫర్ చేశారు. మేము ఎసిపి ని కలవగా చాలా అవమానకరంగా మాట్లాడుతూ, ఫోర్జరీ కేసులు ఏమి లేవు. మీరు ఆ భూమి వారికి రిజిస్ట్రేషన్ చెయ్యండి, లేకుంటే మీ పై కేసులు పెట్టి జైలుకు పంపిస్తా అంటూ భయభ్రాంతులకు గురి చేయడంతో, ఎం చెయ్యాలో అర్ధంకాని పరిస్థితి లో ఉన్నామని ఆమె రోదిస్తూ తెలిపారు. ఇపుడు వారికి స్థానిక నాయకులా, పోలీసులా? ఎవరు న్యాయం చేస్తారో చూడాలి. న్యాయస్థానం చెప్పినా, క్షేత్ర స్థాయిలో బలం ఉన్న వానిదే రాజ్యం అవుతుంది నేడు.

## ఈడీ కస్టడీలో మంత్రిపార్థా ఛటర్జీ

**20కోట్ల పట్టివేతలో అర్పితా ముఖర్జీ అరెస్ట్**
**ఈడీ బీజేపీకి దాసోహమైందని టీఎంసీ నేతల విసుర్లు**

కోల్‌కత్తా,జూలై23: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కుంభకోణం విషయమై పశ్చిమ బెంగాల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జరిపిన సోదాలు కలకలం రేపుతున్నాయి. బెంగాల్ రాష్ట్ర మంత్రి పార్థా ఛటర్జీ సహాయకురాలు అర్పితా ముఖర్జీ ఇంట్లో సోదాలు చేసి రూ.20 కోట్ల నగదును స్వాధీనం చేసుకొంది. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ టీచర్స్ రిక్రూట్‌మెంట్ స్కాంలో బెంగాల్ మంత్రి పార్థా ఛటర్జీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం నాడు అరెస్ట్ చేసి రెండు రోజుల కస్టడీలోకి తీసుకుంది. కేంద్ర దర్యాప్తు సంస్థ పార్థా ఛటర్జీని 14 రోజులు కస్టడీకి అప్పగించాలని కోరాలని నిర్ణయించింది. సోమవారం నాడు ఈ బెంగాల్ మంత్రిని కోర్టులో హాజరుపర్చనున్నారు. ఈ కేసు గురించి పార్థా ఛటర్జీ తరపు న్యాయవాది సోమ్‌నాథ్ ముఖర్జీ మాట్లాడుతూ.. పార్థా ఛటర్జీ అనారోగ్యంతో బాధపడుతున్నారని.. ఈడీ కస్టడీలో ఉన్న ఆయనను కోల్‌కత్తాలోని ఎస్ఎస్‌కేఎమ్ హాస్పిటల్‌కు వైద్య చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. నక్తాలాలోని ఛటర్జీ నివాసంలో డజన్ల కొద్దీ ఉన్న డాక్యుమెంటన్లు ఇప్పటికే ఈడీ స్వాధీనం చేసుకుంది. ఈ కుంభకోణం కేసులో మంత్రితో పాటు ఆయన సహాయకురాలైన అర్పిత ముఖర్జీని కూడా శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. దక్షిణ కోల్‌కత్తాలోని అర్పిత నివాసంలో లెక్కల్లోకి రాని రూ.20 కోట్ల రూపాయలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్వాధీనం చేసుకుంది. ఈ నగదును కౌంటింగ్ మిషన్ల ద్వారా లెక్కించడానికి బ్యాంకు సిబ్బంది సాయం తీసుకొంది. ప్రస్తుతం పార్థా ఛటర్జీ పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రిగా ఉన్నారు. గతంలో ఆయన విద్యామంత్రిగా ఉన్నప్పుడు ఉపాధ్యాయ నియామకాల్లో అవినీతి జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ పరిణామంపై టీఎంసీ నేతలు బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్ మంత్రి ఫిర్హాద్ హకీమ్ పార్థా ఛటర్జీ అరెస్ట్‌పై స్పందించారు. ఇవాళ పరిస్థితి ఎలా తయారైందంటే.. ఈడీని బీజేపీ నడుపుతోందన్నట్టుగా ఉందని మంత్రి ఫిర్హాద్ ఆరోపించారు. ఈడీని బీజేపీ రాజకీయంగా ప్రభావితం చేస్తోందని ఫిర్హాద్ హకీమ్ తీవ్ర ఆరోపణ చేశారు.

## టీఆర్‌ఎస్‌కు రామచంద్రు తేజావత్ షాక్

**పార్టీని వీడుతున్నట్లు ప్రకటించిన మాజీ ఐఎఎస్**

హైదరాబాద్,జూలై23: అధికార టీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి రామచంద్రు తేజావత్ గుడ్ బై చెప్పారు. ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా ఉన్న మాజీ ఐఎఎస్ రామచంద్రు తేజావత్ టీఆర్ఎస్ కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం, పార్టీ తీసుకున్న నిర్ణయాలు నచ్చక పోవడంతోనే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ తరపున బరిలో నిలిచిన గిరిజన అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతు ఇవ్వకూడదని టీఆర్ఎస్ నిర్ణయం తీసుకోవడం తనకు బాధ కలిగించిందని, అందుకే టీఆర్ఎస్ పార్టీతో తెగదెంపులు చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. టీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని..తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని తేజావత్ రామచంద్రు కోరారు. పార్టీకి, ప్రభుత్వానికి మరెంతో సేవ చేద్దామని అనుకున్నా..కానీ టీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వం తన సేవలను వినియోగించుకోలేదని తేజావత్ రామచంద్రు అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత గవర్నమెంట్‌తో పాటు టీఆర్ఎస్ పార్టీలో తనను భాగస్వామ్యం చేసినందుకు రామచంద్రు ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా తన విధులు వంద శాతం అంకితభావంతో నిర్వర్తించానని చెప్పారు. ముఖ్యంగా కాళేశ్వరం, ఎస్సారెస్పీ స్టోర్మ్ వాటర్ ప్రాజెక్ట్ లకు అన్ని క్లియరెన్స్ వచ్చేందుకు కృషి చేసినట్లు చెప్పారు.

# భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ ద్విసప్తాహం

మొదటిపేజీ తరువాయి..

నిర్వహించాలని అధికారులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజైన 15 ఆగస్ట్ ముందు వారం రోజులు.. అనంతరం వారం రోజులుగా.. 15 రోజుల పాటు 'భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ ద్విసప్తాహ' కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 75 ఏండ్ల ' స్వతంత్ర్య భారత వజ్రోత్సవ ద్విసప్తాహం' నిర్వహణపై శనివారం నాడు ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. 'అటు దేశవ్యాప్తంగా ఇటు తెలంగాణలో, దేశ స్వాతంత్ర్య కోసం సాగిన పోరాటాలు, జరిగిన త్యాగాలు, నాటి జాతీయ నాయకులు, అమరుల వివరాలు నేటి తరానికి అర్థం కావాల్సివున్నది. 75 ఏండ్ల కాలంలో స్వతంత్ర్య భారతం ఎన్నో ఘన విజయాలను సాధించింది. ప్రపంచ దేశాల్లో అతిపెద్ద ప్రజాస్వామిక వ్యవస్థగా భారత దేశం పరిఢవిల్లుతున్నది. భారత స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న భారత దేశాన్ని మరింత గుణాత్మకంగా రూపొందించుకోవాల్సి ఉన్నది. నాడు వారు పొందుపరిచిన ప్రజాస్వామిక, లౌకిక వాద, సమాఖ్యవాద విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారత పౌరునిమీదున్నది.

భారత దేశం భిన్న సంస్కృతులతో, విభిన్న భాషలు, మతాలు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలతో అత్యున్నత ప్రాపంచిక సార్వజనీన విలువలతో భిన్నత్వంలో ఏకత్వాన్ని కొనసాగిస్తున్నది. ప్రపంచ దేశాల్లో భారతదేశానిది విలక్షణమైన సాంస్కృతిక జీవన విధానం. మారుతున్న కాలంలో పెరుగుతున్న సాంకేతికత పని ఒత్తిడి, ఆర్థిక అవసరాల నేపథ్యంలో నాటితరం ఆచరించిన దేశభక్తి కానీ.. అంతటి భావోద్వేగం కానీ నేటి యువతలో ప్రదర్శితమౌతలేవు. ఇటువంటి వాతావరణాన్ని మనం పునః సమీక్షించుకోవాల్సివున్నది. ఈ నేపథ్యంలో స్వతంత్ర్య భారత వజ్రోత్సవాలను ఘనంగా జరుపుకోవాల్సిన అక్కెర దేశభక్తులైన తెలంగాణ బిడ్డలకున్నది. ఈ మేరకు పల్లె పట్నం ఒకటై భారతావని ఘనకీర్తిని చాటాల్సి ఉన్నది' అని సీఎం కేసీఆర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటిమీద జాతీయ పతాకం ఎగరాలని సీఎం అన్నారు. అందుకు అవసరమైన 1 కోటి 20 లక్షల త్రివర్ణ పతాకాల తయారీకి ఏర్పాట్లు చేయాలని కేసీఆర్ అన్నారు. ఇందుకు గద్వాల, నారాయణ పేట్, సిరిసిల్ల, పోచంపెల్లి, భువనగిరి వరంగల్ తదితర ప్రాంతాల్లోని చేనేత పవర్ లూమ్ కార్మికులకు ఆర్డర్లు ఇవ్వాలని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయం మీద జాతీయ పతాకాన్ని అత్యున్నతంగా ఎగరవేయాలన్నారు. జాతీయ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని జీఏడీ అధికారులను సీఎం ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ వాహనం మీద జాతీయ జెండా ఎగిరేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా జండాలను రూపొందించా లన్నారు. ఇందుకోసం అవసరమయ్యే జాతీయ పతాకాల ముద్రాణా ఖర్చు సహా దేశభక్తి ప్రచార కార్యక్రమాలకోసం ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రజా సంచార ప్రాంతాలు, బస్టాండ్లు ప్రాంగణాలు, రైల్వే స్టేషన్లు, సినిమా హాల్స్, షాపింగ్ మాల్స్, పట్టణాల్లోని స్టార్ హోటల్స్ సహా ప్రధాన కూడల్లు రహదారుల వెంట అనువైన చోటల్లా దేశభక్తి స్ఫూర్తిని జాలువారేలా జాతీయ జెండా రెపరెపలాడేలా చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్, సీఎస్ సోమేశ్ కుమార్‌ను ఆదేశించారు. ప్రజలు ఉద్యోగుల నడుమ సత్సంబంధాలు పెంపొందించే ఫ్రెండ్లీ ప్రభుత్వ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. ఉద్యోగుల్లో కూడా దేశభక్తిని రగిలించే సాంస్కృతిక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మండల జిల్లా రాష్ట్ర స్థాయిల్లో ఫ్రీడం రన్' లను నిర్వహించాలన్నారు.

పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల వారి సారథ్యంలో పల్లె నుంచి పట్నం దాకా స్వాతంత్ర్య వజ్రోత్సవ దీప్తిని వెలిగించే దిశగా తగు చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. తెలంగాణనుంచి, దేశంలోని పలు ప్రాంతాలనుంచి, దేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న నాటితరం జాతీయ నాయకుల వివరాలు విద్యాసంస్థల్లో విద్యార్థులకు యువత కోసం అర్థమయ్యే విధంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పీజీ డిగ్రీ జూనియర్ కళాశాలలు సహా గురుకులాలు తదితర ప్రభుత్వ ప్రైవేటు కార్పోరేట్ విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు సహా అన్ని రకాల విద్యాసంస్థల్లో పంద్రాగస్ట్‌కు ముందు వారం రోజులు, పంద్రాగస్టుకు తర్వాత వారం రోజులు మొత్తం 15రోజుల పాటు నిర్వహించబోయే 'స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్విసప్తాహం' కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అధికారులకు వివరించారు. ఇందులో.. ఆటల పోటీలు, వ్యాస రచన పోటీలు, వకృత్వ పోటీలు, చిత్రలేఖనం పోటీలు, దేశభక్తిగీతాల పోటీలు, నాటికలు, ఏకపాత్రాభినయం తదితర దేశభక్తిని ఉద్దీపన చేసే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ చేపట్టాలని సీఎం అన్నారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ మంత్రి, కార్యదర్శి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 'స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్విసప్తాహం' కార్యక్రమాల్లో పోలీసు సహా అన్ని ప్రభుత్వ శాఖలు పాల్గొనాలని సీఎం అన్నారు. ఆయా శాఖల ఉద్యోగులు పదిహేను రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల రోజువారీ షెడ్యూలను రూపొందించుకుని రెండు వారాల పాటు అమలు చేయాలని సీఎం అన్నారు. ఇందుకు సంబంధించిన విధి విధనాల రూపకల్పన కోసం ప్రత్యేక కమిటీని నియమించాలని సీఎస్ సోమేశ్ కుమార్‌ను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సహా సర్పంచ్ స్థాయి ప్రజా ప్రతినిధులతో పాటు, ప్రభుత్వ కార్యదర్శులు సహా ఉన్నతాధికారులు వారి వారి లెటర్ ప్యాడ్లమీద జాతీయ జెండా బొమ్మను ముద్రించుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు. పదిహేను రోజుల పాటు పత్రికల మాస్టర్ హెడ్స్ మీద జాతీయ పతాక చిహ్నాన్ని ముద్రించాలని, టీవీ ఛానల్స్‌లో 15 రోజుల పాటు జాతీయ పతాక చిహ్నాన్ని నిత్యం కనిపించేలా ప్రసారం చేయాలని ఆయా మీడియా యాజమాన్యాలకు సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. స్వతంత్ర భారత వజ్రోత్సవ సప్తాహం' సందర్భంగా దేశ భక్తిని పెంపొందించే కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేయాలని సీఎం కోరారు.

## ఆగస్టు 4న కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభోత్సవం

**సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభించే అవకాశం**

హైదరాబాద్,జూలై23: హైదరాబాద్‌లో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్మించిన పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఆగస్టు 4న కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం అందుతోంది. కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభానికి ముందే సీపీ సీవీ ఆనంద్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్ లో నిర్మితమవుతున్న ఈ భవనాన్ని శనివారం హైదరాబాద్ నగర



పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పరిశీలించారు. నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. దేశంలోనే తొలిసారిగా అన్ని శాఖలను అనుసంధానం చేస్తూ అత్యాధునిక టెక్నాలజీతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అధికారులు నిర్మించారు. కాగా హైదరాబాద్ నగరంలో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ మరో కలికితురాయిగా చేరనుంది. ఏ సమయంలోనైనా, ఎక్కడైనా ఏం జరిగినా క్షణాల్లో పసిగట్టే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి రానుంది. కాగా హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంట్రల్ ప్రపంచస్థాయి కట్టడాల్లో ఒకటిగా నిలవనుందని ఇటీవల మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదొక అద్భుత నిర్మాణంగా అభివర్ణించిన ఆయన.. దుబాయ్‌కి బూర్జ్ ఖలీఫా, ప్యారిస్‌కు ఈఫిల్ టవర్ ఎలాగో.. హైదరాబాద్‌కు కమాండ్ కంట్రోల్ సెంటర్ అంతటి కీర్తిని తెస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ 14వ అంతస్తు నుంచి చూస్తే.. హైదరాబాద్ నగరం నలువైపులా కనిపిస్తుందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్న విషయం తెలిసిందే.

# వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కృషి

మొదటిపేజీ తరువాయి..

వనపర్తిలో ఆందోళన చేస్తున్న వీఆర్ఏలను మంత్రి నిరంజన్ రెడ్డి కలిశారు. తప్పకుండా న్యాయం చేస్తామని వారికి మంత్రి భరోసానిచ్చారు. ఆందోళనలతో సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. తమ వంతుగా ముఖ్యమంత్రి దృష్టికి మీ సమస్యలు తీసుకువెళ్తామని చెప్పారు. తప్పకుండా సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. వెంటనే విధుల్లో చేరాలని వీఆర్ఏలను మంత్రి నిరంజన్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులు, అభినందనలే ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు.

గత మూడేండ్లుగా అభివృద్ధి మీద తప్ప ఎక్కడా రాజకీయాలు మాట్లాడలేదని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి.. చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించమని కోరుతానని తెలిపారు. తాను చేసిన పనులు, చేస్తున్న అభివృద్ధి సత్యం అయితేనే తనకు అండగా నిలవాలని కోరుతానని చెప్పారు. వనపర్తి పట్టణంలో దుర్గంధంతో నిండిన కందకాన్ని శుభ్రం చేసి మార్కెట్‌ను నిర్మించడం జరిగిందన్నారు. అంతకు ముందు కందకం ప్రాంతం దోమలు, పందులు, పాములు, మురుగునీరుతో నిండి ఉండేదని గుర్తు చేశారు. దాని నిర్మాణం చేపట్టినప్పుడు ప్రజలు అపోహ పడ్డారు.. నిర్మాణం పూర్తయ్యాక ఇప్పుడు ఆనంద పడుతున్నారని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. వీఆర్ఏలు జిల్లా కలెక్టరేట్ ను ముట్టడించారు. తెలంగాణ రాష్ట్ర వీఆర్ఏ జెఏసి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వీఆర్ఏలు కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. అయితే భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు వీఆర్ఏలను అడ్డుకుని ఆపేశారు. శాంతియుతంగా నిరసన నిర్వహిస్తామని వీఆర్ఏలు సర్దిచెప్పి ధర్నా చేపట్టారు. ఔటర్ రింగ్ రోడ్డు నుండి ర్యాలీగా వచ్చిన వీఆర్ఏలు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న 195 మంది వీఆర్ఏలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. వీఆర్ఏల ధర్నాకు కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా మద్దతు ప్రకటించారు. వీఆర్ఏలకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వీఆర్ఏ అధ్యక్షురాలు లక్ష్మీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా వీఆర్ఎలకు వెంటనే పే స్కెల్ ఇవ్వాలి అన్నారు. అలాగే తమకు రావాల్సిన ప్రమోషన్స్ కూడా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా వీఆర్ఎలకు ప్రమోషన్లు, పే స్కెల్, 55 సంవత్సరాలు నిండిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్ మాట తప్పారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వీఆర్ఎలకు మద్దత్తు ప్రకటించామన్నారు. వీఆర్ఏలకు న్యాయం జరిగే వరకు వారు చేపట్టే పోరాటంలో పాల్గొంటామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వీఆర్ఏలకు పూర్తిగా న్యాయం చేస్తామని తెలిపారు. జనగామ జిల్లాలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ కాన్వాయ్ ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏలు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. జోరుగా వర్షం కురుస్తున్నా వీఆర్ఏలు అధిక సంఖ్యలో హాజరై దీక్షలో పాల్గొంటున్నారు వీఆర్ఏలు. అటు, జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. నిరసనకు దిగిన విఆర్ఏలు.., వరదపై సమీక్ష సమావేశం కోసం వచ్చిన మంత్రి దయాకర్ రావు కాన్వాయ్ ను అడ్డుకోవడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కాన్వాయ్ ను అడ్డుకున్న వీఆర్ఏలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. కలెక్టరేట్ లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన వీఆర్ఏలను పోలీసులు నిలువరించారు. మరోవైపు, తమ డిమాండ్ల కోసం జిల్లా కార్యాలయాల పికెటింగ్ తర్వాత కూడా.. రాష్ట్ర ప్రభుత్వం సమస్యను పరిష్కారం చేయకపోతే ఈ నెల 25 నుండి సమ్మె తప్పదని హెచ్చరిస్తున్నారు వీఆర్ఏలు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా వీఆర్ఏలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

## కేసీఆర్ కుటుంబం మదిలో ఈడీ.. ఈడీ వినపడుతోంది

## తరతరాలకు సరిపోయేలా సంపాదించారు

## తెలంగాణలో కేసీఆర్ అవినీతిపై కొట్లాడాలి

## ఈడీని వాడుకోవాల్సిన అవసరం మాకులేదు

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

హైదరాబాద్,జూలై23: ప్రజాసంగ్రామ యాత్ర మూడో విడత ప్రారంభం అవుతోంది. బీజేపీ పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు టీబీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్. ఎన్టీవీ ఫేస్ టు ఫేస్ లో తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలను ఆయన వివరించారు. ఆగస్టు 2 నుంచి 20 రోజుల పాటు యాత్ర ప్రారంభమవుతుంది. ఈ పాదయాత్ర ఎన్నికల కోసం కాదు, ప్రజలకు భరోసా ఇవ్వడానికే ఈ యాత్ర చేపడుతున్నాం. ప్రజల బాధల్ని పట్టించుకునే వారు లేరు. ఫాం హౌస్‌లోనే కేసీఆర్ వుంటున్నారు. బాధ్యత గల పార్టీగా మేం యాత్ర చేపడుతున్నాం. ప్రజలకు ధైర్యం చెబుతాం, వరద బాధితుల్ని ఎంతమందిని కలిశారు. గవర్నర్ పర్యటనకు వెళతానని చెప్పడంతో సీఎం కేసీఆర్ వెళ్ళాల్సి వచ్చింది.



గతంలో కేసీఆర్ ప్రగతి భవన్ కు నీళ్ళు వచ్చినా పట్టించుకోలేదు. వరంగల్, హైదరాబాద్ లో వరదలు వచ్చాయి. ఎన్నో కుటుంబాలు నష్టపోయాయి. కానీ కేసీఆర్ పట్టించుకోలేదు. కేంద్రం ఇచ్చింది, మీరు ఇచ్చింది, మీరు ఏం వాడారో కేసీఆర్ చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇవ్వాలి. ఐదు గ్రామాలను దమ్ముంటే తెలంగాణకు ఇప్పించమంటున్నారు. తెలంగాణ ఉద్యమం టైంలో ఒకలా.. ఇప్పుడు మరోలా వ్యవహరిస్తున్నారు. ఈడీ గురించి మాట్లాడితే భయపడుతున్నారు. కేసీఆర్ కుటుంబం మదిలో ఈడీ %%%ఈడీ వినపడుతోంది. తరతరాలకు సరిపోయేలా సంపాదించారు. డబుల్ ఇంజన్ అంటే మోడీ, ఈడీ అనే భావన వారిలో వుంది. ఈడీని అక్రమంగా వినియోగించుకునే స్థితిలో మేం లేం. మేం కోర్టు ద్వారా కొట్లాడతాం. కాంగ్రెస్ ఆందోళన చేస్తోంది. మోడీ, అమిత్ షా గతంలో ఈడీ విచారణ ఎదుర్కొన్నారు. తెలంగాణలో కేసీఆర్ అవినీతిపై కొట్లాడాలి. ఈడీ వస్తుందని నేను చెప్పలేదన్నారు బండి సంజయ్. ఈడీ అంటే వారికే భయం వుంటే నేనేం చేస్తా. కాంగ్రెస్, టీఆర్ఎస్ కలిసి పోటీచేస్తాయి, రేపు కేసీఆర్ అవినీతిపై విచారణ ప్రారంభం అయితే రెండుపార్టీలు కలిసి పోరాడతాయన్నారు బండి సంజయ్. ఆర్టీఐ కింద అనేక అంశాలపై దరఖాస్తులు పెట్టాం. ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ ఏమైందన్నారు. ఒక్కో ఎమ్మెల్యే 2014లో ఇచ్చిన అఫిడవిట్లు, 2018లో ఇచ్చిన అఫిడవిట్లలో ఎంత తేడా వుందో చూడండి. అంత సంపాదన ఎలా వచ్చింది. కేంద్రంలో అధికారంలో వుంది కాబట్టి ఈడీవచ్చిందంటారు. నేను ఫోన్ చేస్తే ఈడీ రాదు. నాపై విచారణ చేయండని, ఈడీకి లెటర్ రాయండి. వాళ్ళు తప్పు చేయలేదు, నిజాయితీ పరులు కదా వారే లెటర్ రాయమనండి. నన్ను బీజేపీ కించపరుస్తోంది, నాపై విచారణ చేయండని మంత్రి కేటీఆర్ కోరవచ్చు కదా అన్నారు బండి సంజయ్. నిప్పు లేనిదే పొగరాదు కదా. గ్లోబరీనా సంస్థ గురించి నేను ఆరోపణలు చేశా. సంబంధం లేకుంటే.. విచారణ ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. 27 మంది విద్యార్థుల ఉదంతంపై వాస్తవాలు బయటపెట్టాలన్నారు బండి సంజయ్. బాధ్యత వహించాల్సింది మంత్రులు, సీఎం.బీజేపీ టీఆర్ఎస్ కుమ్మక్కయిందని ఆరోపణలపై బండి సంజయ్ మండిపడ్డారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ కలిసి పోరాడతారు. రాష్ట్రపతి ఎన్నికల్లో కలిసి పనిచేశారు. రేవంత్ రెడ్డి వెళ్లి ఈడీ ఆఫీసుకి వెళ్లి ఫిర్యాదుచేస్తే వచ్చేస్తారా? దొంగల్ని తప్పించడానికి కాంగ్రెస్ చేస్తున్న పన్నాగం అన్నారు. జాతీయ కార్యవర్గ సమావేశాలు ఒక్కో రాష్ట్రానికి ఇస్తారు, మాకు అవకాశం ఇచ్చారు. అధికారంలోకి వస్తామని చెప్పడం ఆత్మవిశ్వాసం. మోడీ నాయకత్వంలో తెలంగాణలో అధికారంలోకి వస్తాం. కుటుంబ పాలన అంతం చేయడానికి కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి సిద్ధంగా వున్నారు.ఆయన పార్టీలో చేరతారా లేదా అనేది నాకు తెలీదు. బండి సంజయ్ పై వ్యతిరేకత లేదు. మంత్రి శ్రీనివాస్ ని తప్పించడం అనేది పార్టీ వ్యవహారం. అటువంటి వ్యక్తులమీద కామెంట్లు చేయవద్దు. మా ఇద్దరి మధ్య ఏంలేదు. మేం కలిసి పనిచేశాం. నడ్డాగారిని అడిగి సీఎం ఎవరో చెబుతారు. వ్యక్తిగతంగా పదవులు నిర్ణయించే పార్టీ కాదన్నారు. మాలో వర్గాలు ఏం లేవు. అంతా కలిసి పనిచేస్తున్నాం. కమిటీలు వేసి అన్నీ నిర్ణయించుకుంటున్నాం. ఇన్ని కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయన్నారు. మాది కాషాయ జెండా. మాది ఒకటే అజెండా. ఎస్టీ ఆడబిడ్డకు రాష్ట్రపతిగా అవకాశం ఇస్తే టీఆర్ఎస్ ఎందుకు మద్దతు ఇవ్వలేదని బండి సంజయ్ ప్రశ్నించారు.



జనగామ జిల్లా లింగాల ఘనపురం మండల ఎస్.ఐ. రఘుపతి ఆధ్వర్యంలో పటేలుగూడెం వాగు ప్రవాహాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న తెరాస నాయకులు, బొల్లంపల్లి నాగేందర్, బోయిని రాజు, బైరు యాకన్న, ఉప్పల మధు.



జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ గ్రామంలో ఉడుత గట్టమ్మ అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియలకు శాగ ధనప్రకాష్ సుజనా ఫౌండేషన్ తరుపున అంత్యక్రియలకు కర్ర సహాయం చేసిన వ్యవస్థాపకులు శాగ దేవరాజ్ చేసిన 66వ సహాయం.

## భారతీయ మజ్దూర్ సంఘ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

**ధర్మపురి జూలై 23 (ప్రజామంటలు):** జైన లో శ్రీరామ తాపీ మేస్త్రీ సుతారి సంఘం



ఆధ్వర్యంలోభారతీయ మజ్దూర్ సంఘ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ జెండా ఆవిష్కరణ చేసి వేడుకలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ జెండా ఎగురవేశారు. కార్యంలో గ్రామ ఇంచార్జి సర్పంచ్, కుడిక్యాల మహేష్, జాయింట్ చెక్ పవర్ వార్డ్ సభ్యులు కోరుట్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్, నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంటసుధాకర్, బీజేపీ మండల అధ్యక్షులు సంగెపు గంగారాం, తెరాస గ్రామ అధ్యక్షుడు గాండ్ల రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాజుల సత్తయ్య, సుతారి సంఘం వైస్ ప్రెసిడెంట్ కోరుట్ల సత్తయ్య, క్యాషియర్ బిల్లవేని వెంకటేష్, ప్రచార కార్యదర్శి మెరుగు లచ్చన్న, కార్యవర్గ సభ్యులు, సుతార్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ను కలిసిన రాష్ట్ర కౌన్సిలర్స్, ఫోరమ్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు

**జగిత్యాల జూలై 23 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర కౌన్సిలర్స్ ఫోరం జగిత్యాల



జిల్లా అధ్యక్షునిగా పంబాల రామ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా తోట మల్లికార్జున్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా శనివారం జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేయగా అభినందించిన ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు గట్టు సతీష్,జిల్లా రైతు బంధు సమితి మెంబర్ దామోదర్ రావు, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, ఉపాధ్యక్షులు దూమాల రాజ్ కుమార్, రాష్ట్ర వడ్డేర సంఘ అధ్యక్షులు వల్లేపు మొగిలి, నాయకులు భోగ ప్రవీణ్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

## సీఎం.ఆర్.ఎఫ్. చెక్కుల అందజేత

**కథలాపూర్ జూలై 23 (ప్రజామంటలు):** గంభీర్ పూర్ గ్రామనికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరు అయిన చెక్కులను శనివారం ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు. గంభీర్ పూర్ గ్రామానికి చెందిన



మల్యాల జలంధర్ కు 55,000 వేలు, బోలుమల్ల గంగు కు 60,000, కమల్ల సురేష్ కు 15,500, శనిగరపు పెద్ద గంగారాం 33,000 రూపాయల విలువ గల చెక్కులను జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపిపి జవ్వాజి రేవతి చేతుల మీదుగా లబ్ధి దారులకు అందేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు టీఆరెఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతు సిందుజ శేఖర్,ఉప సర్పంచ్ జవ్వాజి శ్రీను,మండల అధ్యక్షులు గంగ ప్రసాద్, జెల్ల వేణు, శీలం మోహన్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు బాబా శంకర్, నస్కురి భాస్కర్, ముంజ శ్రీను, సత్తార్ పలువురు ఉన్నారు.

# మానకొండూరు మండలంలో విస్తృతంగా పర్యటించిన కవ్వంపల్లి

**మానకొండూర్ జులై 23 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలో అభివృద్ధికి ఆమడ దూరంగా అధికార పార్టీ ఎంపీపీ అంటున్న గ్రామ ప్రజలతో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని మహిళలు రైతులు ఇవ్వలేదని వారి సమస్యలు చెప్పుకున్నారు. అధికార పార్టీ నాయకులకు ఇసుక రవాణా మీద ఉన్న శ్రద్ద గ్రామ అభివృద్ధి మీద లేదని ప్రజలు మండిపడ్డారు. అనంతరం రైతులతో కలిసి నాసిరకంగా నిర్మించిన చెక్ డ్యాం పరిశీలించి లోయర్ మానేరు డ్యాం గేట్లు తెరవడంతో మానేరు పరివాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా





వ్యవసాయ కూలీలతో ముచ్చటించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళాలు కవ్వంపల్లి తో మాట్లాడుతూ.... కొత్త పింఛన్లు ఇవ్వడం లేదని మా గ్రామంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూం ఇండ్లు ఉండాలని రైతులకు సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన పింగిలి మోహన్ రెడ్డి, పింగిలి రాజిరెడ్డి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## లోతట్టు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించిన సి.పి.ఎం. నాయకులు

**జనగామ జూలై 23 (ప్రజామంటలు):** వరద నివారణ చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జనగామ పట్టణంలో రెండో వార్డు మెషిన్ కాంపౌండ్ ఏరియా, బాలాజీ నగర్, సాయి నగర్. కురుమవాడ, శ్రీనగర్ కాలనీ, జ్యోతి నగర్, నెహ్రూ పార్క్ ఏరియా లలో శనివారం సిపిఎం బృందం వరద ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు మాట్లాడుతూ.... వర్షాకాలంలో పట్టణంలో రంగప్ప చెరువు నుండి వస్తున్న వరదను పక్కా ప్రణాళిక ద్వారా బీరప్ప గడ్డ నుండి నెల్లుట్ల వరకు అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక సందర్భాలలో ఎమ్మెల్యే దృష్టికి మున్సిపల్ చైర్మన్ దృష్టికి కమిషనర్ దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ చిన్న మోరిని నిర్మించారు. ఆ మోరి నుండి కొద్ది నీళ్ళు మాత్రమే పోతున్నాయి. ఇక్కడి కాలనీ నుండి ప్రజలు ఇంటి పన్నులు కడుతున్నారు. కానీ మున్సిపల్ అధికారులు ప్రజలను పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజలు గుర్తొస్తారు. కానీ విపత్తులు కలిగినప్పుడు ప్రజలను మర్చిపోతున్నారు. వరద వచ్చిన తర్వాత పాములు క్రిమి కీటకాలు అనేకమైనటువంటి రోగాలు వచ్చే ప్రమాదాలు ఉన్నాయని, నివారించడంలో మున్సిపల్ పూర్తి వైఫల్యం ఉందని అన్నారు. ఇప్పటికైనా లోతట్టు ప్రాంతాలలో వరద నివారణ చర్యలు చేపట్టి రోడ్లపైకి వచ్చిన బురదను తీసి బ్లీచింగ్ పౌడర్ దోమల మందు కొట్టాలని, అన్నారు లేకపోతే రాబోయే రోజులలో ప్రజలందరినీ ఐక్యం చేసి



ఉద్యమాలు చేసి మున్సిపల్ ముట్టడి చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బూడిద గోపి, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, నాయకులు చుంచు విజేందర్, భాషాపాక విష్ణు, గంగరబోయిన మల్లేష్ రాజ్, కళ్యాణ్, నల్ల యాకయ్య, రవి, బొట్టు శివ, లావుడియా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మా డిమాండ్ల పరిష్కారానికై ఎంతటి పోరాటానికైనా సిద్ధం

**చిగురుమామిడి జూలై 23 (ప్రజామంటలు):** కలెక్టరేట్ ముందు కొనసాగిన రిలేనిరాహార దీక్షలు పికటింగ్లో పాల్గొన్న మండల రెవెన్యూ సహాయకుల బృందం ప్రభుత్వం స్పందించకపోతే 25 నుండి నిరవధిక సమ్మె ప్రారంభం. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట మూడు రోజులుగా కొనసాగిన రిలే నిరాహారదీక్షలు శనివారం జరిగిన పికట్టింగ్ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు కున రాజేందర్ అధ్వర్యంలో రెవెన్యూ సహాయకుల బృందం పాల్గొన్నారు. కున రాజేందర్ మాట్లాడుతూ.... పే స్కేల్ జిఓ అర్హత ఉన్న వారికి ఉద్యోగాలు యాబై ఐదు సంవత్సారాలు పై బడిన సహాయకుల వారసులకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14 తేదిన మండల తహసీల్దార్ ముబిన్ అహ్మద్ కి సమ్మె నోటీసుకు ఇచ్చామని ప్రభుత్వం స్పందించకుంటే 25వ తేది నుండి మండల వ్యాప్తంగా ఉన్న రెవెన్యూ సహాయకులు నిరవదిక సమ్మె ప్రారంభం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ కందుకూరి బాపు దేవ్, జిల్లా కన్వీనర్ నల్వాల మల్లేశం, వివిధ మండలాల బాధ్యులు, గ్రామ సహాయకులు, చిగురుమామిడి అధ్యక్షుడు కున రాజేందర్, అందే రవీందర్, ఉపాధ్యక్షుడు నారాయణపురం రాజు, జనరల్ సెక్రెటరీ బూడిద సత్తయ్య, జాయింట్ సెక్రటరీ తల్లా శ్వేత, సెక్రెటరీ మచమల్ల వెంకట నర్సు, కోశాధికారి పైస సతీష్, ఆర్గనైజర్ మేదిని శ్రీకాంత్,





పెనుకుల తిరుపతి, జన్నవెని ప్రవీణ్, మట్టెల లక్ష్మయ్య, తీగల సరస్వతి, మరెల్ల లచ్చయ్య, తలారి లింగయ్య, అడ్వైజర్ మేశ రాజయ్య, పెనుకిల నరసయ్య, మీడియా సుకోసి స్వాతి, అనిత దేవి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆసుపత్రిలో మంత్రి కేటీఆర్ బర్త్ డే వేడుకలు

### టీఎన్జీవో ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు

**సికింద్రాబాద్ జూలై 23 (ప్రజామంటలు):** రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం గాంధీ ఆసుపత్రిలో టీఎన్జీవో యూనియన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా హైదరాబాద్ జిల్లా టీఎన్జీవో ప్రెసిడెంట్ ముజీబ్ హుస్సేన్ , గాంధీ సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు, గాంధీ యూనిట్ ప్రెసిడెంట్ జి. ప్రభాకర్, సెక్రటరీ కె.యాదిలాల్ లు ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి, కేకును కట్ చేశారు. అలాగే హైదరాబాద్ జిల్లా టీఎన్జీవో శాఖ తరపున గాంధీ ఆసుపత్రికి పేషంట్ల కోసం బీపీ చెకింగ్ మిషన్లను విరాళంగా అందచేశారు. ఆసుపత్రిలోని పారామెడికల్ సిబ్బంది కొరత తీర్చడానికి ప్రభుత్వంతో మాట్లాడతానని హైదరాబాద్ టీఎన్జీవో ప్రెసిడెంట్ ముజీవ్ హుస్సేన్ హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆర్.ఎం.వో%--%1 డా. జయకృష్ణ, డిప్యూటి సూపరింటెండెంట్ ప్రొ. శోభన్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ సుభాన్ హుస్సేన్, ఆఫీస్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్, గాంధీ టీఎన్జీవో యూనిట్ వైస్ ప్రెసిడెంట్ కలీమ్, ట్రెజరర్ కె.శ్రవన్ కుమార్, ప్రతినిధులు సరళ బాయి, విజయలక్ష్మీ,



మక్సుద్, ప్రవీన్, సత్యనారాయణ, రాజ్ కుమార్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ శంకర్, శ్రీనివాస్, వైదిక్ పాల్గొన్నారు.

## విజయ డైరీలో దళిత బంధు లబ్ధిదారులకు అవగాహన

**జనగామ జూలై 23 (ప్రజామంటలు):** విజయ డైరీ ప్రాంగణంలో దళిత బంధు లబ్ధిదారులకు అవగాహన శిక్షణ కార్యక్రమము ఎస్.సి. కార్పొరేషన్ ఆధ్వర్యములో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఇడి డా. జి. వెంకన్న మాట్లాడుతూ.... డైరీ లబ్ధిదారులకు మొదటి విడతగా 4 గేదెలు ఇస్తారని, గేదెల కోసం షెడ్ల నిర్మాణం కోసం డబ్బును విడుదల చెయ్యడం జరిగిందని తెలిపారు. జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ శ్రీనివాస్ లబ్ధిదారులకు అవగాహన పాల ఉత్పత్తి పెరగటానికి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ.... విజయ డైరీ ద్వారా చాలా రకాలుగా లాభాలు వస్తుంటాయని తెలిపారు. కొనుగోలు కోసం వెళ్ళాలని తెలిపారు. పాడి పశు



వులకు ఇన్సూరెన్స్ తప్పక చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమములో మండలము లోని 7 గురు దళిత లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జగిత్యాల లో బీసీ స్టడీ సెంటర్ ప్రారంభం

**జగిత్యాల జూలై 23 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రంలో మోతె రోడ్డు లో బీసీ స్టడీ సెంటర్ ను శనివారం ప్రారంభించిన సంక్షేమశాఖ మంత్రివర్యులు



కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జెడ్పి చైర్ పర్సన్ దావా వసంత సురేష్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మెన్ రాజేశం గౌడ్, మున్సిపల్ ఛైర్మెన్ లు భోగ శ్రావణి ప్రవీణ్, మోర హనుమండ్లు, జిల్లా కలెక్టర్ జి. రవి. వీరితో పాటు ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మెన్ బండ శ్రీనివాస్, జిల్లా అధికారులు సాయి బాబా, డా. నరేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 36 రోజులుగా జైల్లో ఉన్న భూనిర్వాసితుల విడుదల

### మరో ఇద్దరికి దొరకని బెయిల్

**హుస్నాబాద్ జూలై 23 (ప్రజామంటలు):** గౌరవెల్లి భూ నిర్వాసితుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గత కొన్ని రోజులుగా గౌరవెల్లి భూ నిర్వాసితులు



చేస్తున్న న్యాయమైన పోరాటంపై ప్రభుత్వం కక్ష కట్టి భూ నిర్వాసితుల పైన అక్రమ కేసులు బనాయించి నలుగురిని దాదాపు 36 రోజులు జైల్లో పెట్టడం జరిగింది. భూ నిర్వాసితుల హక్కుల కోసం పోరాడిన బద్దం శంకర్ రెడ్డి, అంగెటి తిరుపతి రెడ్డి లకు ఎట్టకేలకు బెయిల్ మంజూరు కావడంతో శనివారం కరీంనగర్ జిల్లా జైలు వద్ద బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి భూనిర్వాసితులతో కలిసి వారికి స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా రాగి శ్రీనివాస్, భూక్య సక్రులకు బెయిల్ మంజూరు కాకపోవడంతో వారిని విడుదల చేయలేకపోయారు. జైలు జీవితం అనుభవించి విడుదలపై వచ్చిన నిర్వాసితుల కుటుంబాలు సంతోషం వ్యక్తం చేశారు.

## కొత్తపల్లి లో మెడికల్ క్యాంప్, 150 మందికి పరీక్షలు

**లింగాల గణపురం జూలై 23 (ప్రజామంటలు):** జనగామ జిల్లా లింగాల గణపురం మండలం, కొత్తపల్లి గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల



ఆవరణలో మెడికల్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ కరుణాకర్ రాజు మాట్లాడుతూ.... సీఎం కేసీఆర్, కలెక్టర్ ఆదేశాల మేరకు సీజన్ వ్యాధుల, అంటూ వ్యాధులు గూర్చి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. శనివారం 150 మంది పేషెంట్లకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుంగ ప్రవంతి నాగరాజు, పంచాయితీ కార్యదర్శి సంతోషి మాత, డాక్టర్లు, ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వరద ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ సహాయ చర్యలు

**జనగామ జూలై 23 (ప్రజామంటలు):** తెలుగు దేశం పార్టీ జనగామ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ రామిని హరీష్ రాష్ట్రం లోని భారీ వర్షాలతో కురుస్తున్న జనగామ పట్టణము అతలాకుతలం కాగా సహాయ చర్యలు చేపట్టారు. మోరీలు, నిండి షాపులముందు వ్యాపారులకు ఇబ్బందిగా మారిన తరుణంలో నేనున్నానని



ముందే ఉండే నాయకుడు హరీష్ స్వంత ఖర్చులతో ట్రాక్టర్ ను తెప్పించి దగ్గరుండి రోడ్డు మీద పేరుకుపోయిన నీళ్లను ట్రాక్టర్ పైపు ద్వారా 2 రెండు గంటల పాటు మళ్ళించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ నాయకుడు బైరు బాబు, జిల్లా కార్యదర్శి పరకాల శ్రీనివాస్ గౌడ్, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు ఎండీ ఎక్బల్, సీరాజ్, జనగామ నియోజక వర్గ నాయకులు కొణిదెల కిషన్ ప్రసాద్, గుగులోతు కనకరాజు, పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ చోటమియా, పట్టణ అధికార ప్రతినిధి తాళ్లపల్లి ఏల్లేష్, పట్టణ బీసీ సెల్ నాయకుడు గోళ్ల శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదిన వేడుక.... మొక్కలు నాటిన సర్పంచ్

**తరిగొప్పుల జూలై 23 (ప్రజామంటలు):** కేటీఆర్ పుట్టినరోజు వేడుకలలో



భాగంగా మండల కేంద్రము లొ సర్పంచ్ దామెర ప్రభుదాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి కేటీఆర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయరావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, టిఏ మహేష్, ఉప సర్పంచ్ అంకం శ్రీనివాస్, కారోబార్ జల్లి సిద్ధిరాములు, ఫీల్డ్ అసిస్టెంట్ కిరణ్, వార్డు సభ్యులు బీమా, తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్య పుస్తకాల పంపిణీ

**గొల్లపల్లి జూలై 23 (ప్రజామంటలు):** జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల రాపల్లి లో ఈరోజు ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీ నల్ల శ్యామ్ పాఠశాల



ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ గారు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆంజనేయులు గారు పాల్గొన్నారు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసి తమ బంగారు భవిష్యత్తు చదువుకోడంతో సహకారం అవుతుందని గ్రామ సర్పంచి విద్యార్థులకు తెలియజేశారు. ప్రభుత్వం విద్యార్థుల కొరకు ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందని అట్టి సదుపాయాలు విద్యార్థులందరూ వినియోగించుకోవాలని తెలియజేశారు. విద్యార్థులందరూ ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానంలో ఉండాలని తెలియజేశారు.

## చైర్ పర్సన్ ను కలిసిన రాష్ట్ర కౌన్సిలర్ ఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శి

**జగిత్యాల జూలై 23 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర కౌన్సిలర్స్ ఫోరం జగిత్యాల జిల్లా అధ్యక్షునిగా పంబాల రామ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గా



తోట మల్లికార్జున్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా చైర్ పర్సన్ శనివారం డా. భోగ శ్రావణి ప్రవీణ్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేయగా, చైర్పర్సన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, రాష్ట్ర వడ్డేర సంఘ అధ్యక్షులు వల్లేపుమొగిలి కౌన్సిలర్లు చుక్క నవీన్, కోర గంగమల్లు, గోలి శ్రీనివాస్, రాష్ట్ర వడ్డేర సంఘ అధ్యక్షులు వల్లేపు మొగిలి, నాయకులు డిష్ జగన్, కూతురు శేఖర్, పులి శ్రీధర్ ఉన్నారు.

## భోలక్ పూర్ కృష్ణవేణి స్కూల్‌లో బోనాల ఉత్సవాలు



**సికింద్రాబాద్ జులై 23 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ లోని భోలక్ పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో శనివారం బోనాలు వేడుకలను కన్నుల పండువగా జరుపుకున్నారు. ఈసందర్భంగా సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అలాగే మెహందీ వేడుకలు ఆనందోత్సవాల మధ్య జరుపుకొని నృత్యాలు చేశారు. ఈసందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ డా. మంచాల శ్రీనివాసులు మాట్లాడుతూ.... మన చారిత్రక, సాంస్కృతి, సంప్రదాయలను ఎల్.కే.జీ, యూకేజీ చిన్నారులకు అవగాహన కల్పించేందుకు తమ స్కూల్ ప్రతి పండుగను జరుపుతామన్నారు. కార్యక్రమంలో విజయ్, జ్యోతి, సంపూర్ణ, పుష్పలత, నాగమల్లేశ్వరీ, బుచ్చిప్రసాద్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా బుగ్గారం మం. జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వారిని జగిత్యాలలోని వారి నివాసంలో పరామర్శించిన మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ రమణ, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్.

# మానవసేవే.... మాధవ సేవ

- నేడు జెఎస్ఆర్ జన్మదినం
- ప్రజా సేవలో ముందుంటున్న జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి
- వృక్ష ప్రసాద దాత గా రాష్ట్ర వ్యాప్త గుర్తింపు

**హుస్నాబాద్ జూలై 23 (ప్రజామంటలు):** మార్గాన్ని దాటేవాడు సమర్థుడు, మార్గాన్ని చూపేవాడు నాయకుడు అన్న పదానికి నిలువెత్తు నిదర్శనం జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి. అందరూ ముద్దుగా జెఎస్ఆర్ అని పిలుచుకునే నాయకుడు ప్రజల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటున్న ప్రజా నాయకుడు. ఆపదలో ఉన్నవారికి గొప్ప మనసున్న నాయకుడు. ఆడబిడ్డలకు పెళ్లిళ్లు జరిపించడంలో అండగా నిలుస్తున్నారు. వైద్య సహాయం కోసం తన దగ్గరికి వచ్చిన వారికి తన వంతు సహాయం చేయడంలో సహృదయుడు. నియోజకవర్గంలోని ఏడు మండలాలు కాళ్లు అరిగేలా తిరిగి ఎన్నో కార్యక్రమాలు జరిపించారు. నియోజకవర్గంలోని పలు ఆలయాలకు తన వంతుగా చేయూత అందించారు. తన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే గుణం దేశంలో ఎక్కడా లేనివిధంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారిలకు స్వచ్ఛమైన నీటిని అందించడంలో మన జె ఎస్ ఆర్ ఆయనకు ఆయనే సాటి. రానున్న






నేనున్నాను అంటూ ఆపన్న హస్తం అందించడంలో ముందుంటున్న జెఎస్ఆర్. ఏదో ఒక సేవ, సమాజంలోని ఎవరికో ఒకరికి, చేయకపోతే, మనం కూడా అభివృద్ధి చెందలేమని, సమాజం అభివృద్ధి చెందితేనే మనం అభివృద్ధి చెందినట్లు అనే గొప్ప ఆలోచనతో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా టీమ్ జేఎస్ఆర్ పేరుతో అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి (జేఎస్ఆర్). గత కరోనా కష్టకాలంలో పేదలకు నేనున్ననంటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి స్వస్థలం పాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లీ ప్రస్తుతం హనుమకొండ జిల్లా వేలేరు మండలం లోని కన్నారం గ్రామంలోని తిరుపతి రెడ్డి ప్రమీలమ్మ దంపతులకు జన్మించాడు. జెఎస్ఆర్ విద్యాభ్యాసం మొత్తం హనుమకొండ లోనే జరిగింది. ఉద్యోగం చేస్తూ వ్యక్తిగతంగా వ్యాపారంలో రాణించడం ఎంత ఎదిగిన ఒదిగి ఉండే లక్షణం పుట్టిన గ్రామానికి ఏదైనా చేయాలనే తన వంతుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ నియోజకవర్గం పేరు తెచ్చుకొని అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడంలో ముందుంటున్నాడు. ప్రకృతి ప్రేమికుడిగా లక్షల పండ్ల మొక్కలను పంపిణీ చేసిన మన వృక్ష ప్రసాద దాత పలు జిల్లాలలో అందరికీ సుపరిచితుడే. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం మొక్కతో పాటు బ్యాగు అందజేసిన ప్రకృతి ప్రేమికుడు రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాల్లో తెరాస పార్టీ నుండి బయటికి వచ్చిన వైనం అందరికీ తెలిసిందే. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారు చనిపోతే జెఎస్ఆర్ తరపున 50 కేజీల నాణ్యమైన బియ్యం అందజేసి దశదిన కర్మలో తన వంతుగా సహాయం అందిస్తున్న



హుస్నాబాద్ అసెంబ్లీ ఎలక్షన్లలో జే ఎస్ ఆర్ గెలుపు ఖాయమని రాజకీయ విశ్లేషకులు చర్చించుకోవడం విశేషం. సురేందర్ రెడ్డి సేవా కార్యక్రమాలను చూసి అధికార పార్టీ నాయకులు సైతం బెంబేలెత్తిపోతున్నారు.

**వృక్ష ప్రసాద ధాతగా పేరొందిన జీఎస్ఆర్...**

వృక్షో రక్షితి రక్షితః అనే నినాదంతో హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో కొన్ని లక్షల మొక్కలను ప్రజలకు పంపిణీ చేసిన ఘనత జెఎస్ఆర్కే దక్కింది. పర్యావరణ పరిరక్షణలో తన వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నినాదంతో హరితహారం అనే కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టక మునుపే మన జనపరెడ్డి సురేందర్ రెడ్డి మొక్కలు పంపిణీ చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

**నేడు జె ఎస్ ఆర్ జన్మదినం**

జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్ లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. టీం జె ఎస్ ఆర్ సభ్యులు మరియు అభిమానులు అధిక సంఖ్యలో ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని జెఎస్ఆర్ పై తమ అభిమానాన్ని చాటుకోనున్నారు. నిరుపేదలకు పండ్లు మరియు ఆహార పదార్థాలు పంపిణీ చేయనున్నట్లు టీజెఎస్ఆర్ సభ్యులు తెలిపారు.

## కెటిఆర్ జన్మదినం మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

**వరంగల్ జులై 23 (ప్రజామంటలు):** శనివారం మదర్ ఫౌండేషన్ అధ్యక్షులు మెట్టె చిరంజీవి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ గారి ఆదేశానుసారం హన్మకొండ కెయు క్రాస్ లో వున్న తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమలు మరియు పురపాలక శాఖా మాత్యులు కల్వకుంట్ల తారకరామారావు గారి జన్మదినం సందర్భంగా ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో లైబ్రరియన్ పనిచేస్తున్న కొణతం శ్రీహరి సహకారంతో ఐఐటి, జేఈఈ, ఎఐఈఈఈ కి సంబంధించిన సుమారు 6 వేల రూపాయాల విలువగల 30 పుస్తకాలను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారికి, విధ్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మదర్ ఫౌండేషన్ అధ్యక్షులు మోటె చిరంజీవి మాట్లాడుతూ విధ్యార్థులు ఈ పుస్తకాలను వినియోగించుకొని రాబోయే రోజులలో ఐఐటీలలో మంచి ర్యాంకులు పొందాలని, కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, ప్రతి వ్యక్తి మహాశక్తి గా ఎదగాలంటే నీతి, నిజాయితి, పట్టుదల, ఏకాగ్రత, నిరంతర శ్రమ ఈ పంచ సుత్రాలను పాటించినట్లయితే విద్యార్థులు వారు అనుకున్న గమ్యాలను, ర్యాంకులను సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో హింగే శివాజీ, కందేరావు, సుధాకర్, కిషన్ రావు, సంతోష్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## బిజెపి వర్గీకరణ పై నిర్లక్ష్యం ప్రదర్శించడం నమ్మక ద్రోహమే

**డా. లక్ష్మీనారాయణ నాయక్, ఇనుముల నర్సయ్య మాదిగ**

**జనగామ జూలై 23 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలో ఎస్.సి. రిజర్వేషన్ల వర్గీకరణ కు చట్టబద్ధత కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.పి, ఎం.ఎస్.ఏఫ్, వి.హెచ్.పి.ఎస్ ఆధ్వర్యం జిల్లా కన్వీనర్ పైస రాజశేఖర్ మాదిగ అధ్యక్షతన నిరసన దీక్షలు 3 వ రోజు కి చేరుకున్నాయి. ఈ దీక్షలకు ముఖ్య అతిధులుగా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్, ఎం.ఎస్. పి జిల్లా ఇంచార్జి ఇనుముల నర్సయ్య మాదిగ పాల్గొని మాట్లాడుతూ.... గత 30 ఏళ్లుగా వర్గీకరణకు అనుకూలమంటూనే సమస్యను పరిష్కరించకుండా రాజకీయ డ్రామాలాడుతు మాదిగల్ని నయవంచనకు గురిచేశాయని, కేంద్రం కాలయాపన చేస్తుందని వారు అన్నారు. ఎన్నో వివాదాస్పద బిల్లులకు సైతం పార్లమెంటు ద్వారా చట్టబద్ధత కల్పిస్తున్నా బిజెపి సామాజిక న్యాయమైన వర్గీకరణ సమస్యను పరిష్కరించకుండా నమ్మక ద్రోహం చేస్తుందని గత డెబ్బై ఏండ్లు గా ఎస్సీ రిజర్వేషన్లు ఏకపక్షంగా అనుభవించిన కొన్ని దోపిడీ కులాలకు భయపడి వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా పిరికితనాన్ని ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. ఎవరు అడిగారని అగ్రకులాలకు 10% రిజర్వేషన్లు, త్రిబుల్ తాలక్, జిఎస్టి, నోట్ల రద్దు, పౌరసత్వం, బాబ్రీ, జమ్మూకాశ్మీర్ 371 తదితర చట్టాలు తెచ్చారని..?? కేంద్ర ప్రభుత్వం పై ఒక్కపైసా కూడా భారం పడని న్యాయమైన సమస్యపై మాత్రం తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ పోరాటం చివరి దశలో ఉందని బీజేపీ పార్లమెంట్ లో బిల్లు పెడితే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. వర్గీకరణ చేసే అధికారం ఉండి కూడా బిల్లు పెట్టకుండా మోసగిస్తున్న బీజేపీ పై 27 ఏళ్ల మాదిగ జాతి ఆవేదన క్రమక్రమంగా ఆగ్రహ రూపం దాల్చుతుందని అది కట్టలు తెంచుకున్న నాడు జరగబోయే పరిణామాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని గుర్తుచేశారు. ఇప్పటికైనా




వర్గీకరణపై తమ వైఖరిని స్పష్టం చేసి పార్లమెంట్ లో బిల్లు పెట్టాలని లేకపోతే మాదిగల నిరసన చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు... ఈ దీక్ష కార్యక్రమంలో బేడా బుడగ జంగం జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి పత్రి నర్సింహులు, దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణమూర్తి గౌడ్, మండల ఇంచార్జి నిర్మల భాస్కర్, ఎంఆర్పిఎస్ జిల్లా కో కన్వీనర్ ఇనుముల అనిల్ మాదిగ, జనగామ టౌన్ ఇంచార్జి గువ్వల రవి, కొమ్మగాళ్ల కృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిర్రు నగేష్ మాదిగ, కడమంచి రమేష్, నాయకులు పాలమకుల శ్రావణ్ మాదిగ, పొట్టి రమేష్ మోటకూరు వెంకటేష్, బక్క వివేక్, సురేష్ , రాజేష్, శ్రీకాంత్ , పాలమకుల సంతోష్, తాళ్లపల్లి ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధు యూనిట్ 'డోజరు' ను తనిఖీ చేసిన ఇ.డి.

**తరిగొప్పుల జూలై 23 (ప్రజామంటలు):** దళితబంధు పథకం ద్వారా మంజూరైన యూనిట్లను జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్న మండలంలోని సోలిపురం గ్రామంలో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశంతో ఆర్థికాంగా అబివృద్ధి చెందాలని లబ్ధిదారుడు దండె సురేందర్, తీసుకున్న డోజరు ను పరిశీలించారు.





జగిత్యాలలో తడిచిన, మొలకలతో ర్యాలీ నిర్వహించి, తడిచిన ధాన్యంతో తమకు నష్టం కలుగుతుందని, మోతాదుకు మించి ధాన్యం దించారని, ప్రభుత్వమే వేలం వేయాలని కోరుతూ కొత్త బస్టాండ్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి వినతి పత్రం అందజేసిన జగిత్యాల రైస్ మిల్లర్లు



పన్నీరు రిత్విక్ పుట్టినరోజు సందర్భంగా తాత పన్నీర్ శ్రీనివాస్ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద నిరాశ్రయులకు అనాథలకు అన్నదానం. పాల్గొన్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమరాజు, ఫౌండేషన్ టీం సభ్యులు బింగి నరసింహులు లకన్ సింగ్, కొత్తపల్లి సుధాకర్, కొత్తపల్లి ప్రకాష్.

## జ్యోతి హైస్కూల్ లో గోరింటాకు వేడుకలు

**జగిత్యాల జూలై 23 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలోని జ్యోతి హైస్కూల్ లో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు (మెహందీ)



వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరి చరణ్ రావు మాట్లాడుతూ.... గోరింటాకు ఆచార పరంగానే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా మంచిది అని చెప్పారు. విద్యార్థులు వివిధ రకాల ఆకృతులలో చేతులని అలంకరించడం చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు హరి చరణ్ రావు, శ్రీధర్ రావు, అజిత రావు, రజిత రావు, మౌనిక రావు పాల్గొన్నారు.

## ఆన్ లైన్ లో ఉద్యోగం పేరిట రూ. 17.25 లక్షలు కొట్టేసిన హ్యాకర్


**హన్మకొండ జులై 23 (ప్రజా మంటలు):** సుబేదారి ఇన్స్పెక్టర్ రాఘవేందర్ కథనం మేరకు.. బాల సముద్రంలోని శ్రీనివాస కాలనీకి చెందిన ఏ. శ్రీహరి పార్ట్ టైం జాబ్ కోసమని ఇంటెర్నెట్ లో సెర్చ్ చేస్తుండగా వాట్సప్ ద్వారా ఓ గుర్తు తెలియని వ్యక్తి వెబ్ సైట్ లింక్ను పంపించాడు. ఇది క్లిక్ చేస్తే పార్ట్ టైం ఉద్యోగాలున్నాయని, ఇష్టమైతే చేసుకోవచ్చంటూ నమ్మిం చాడు. ఆన్లైన్ ద్వారా కొన్ని వస్తువు లను విక్రయిస్తే డబ్బులు వస్తాయని చెప్పాడు. ముందుగా కొంత మొత్తం డిపాజిట్ చేయాలని సూచించడంతో దశల వారీగా వివిధ బ్యాంకు ఖాతాల యూపీఐల ద్వారా రూ. 17.25 లక్షలను గుర్తు తెలియని వ్యక్తి ఖాతాల్లోకి పంపించాడు. తర్వాత వెబ్సైట్ చిరు నామా కనిపించకపోవడంతో మోసపో యినట్లు గుర్తించి సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైం విభాగం ప్రత్యేక దర్యాప్తు చేస్తోంది.

## హన్మకొండలో బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశం

**హన్మకొండ జులై 23(ప్రజా మంటలు):** హన్మకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన ఈ రోజు బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశం హంటర్ రోడ్ లో నిర్వహించారు. ఇందులో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ రావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా ఇంచార్జి డాక్టర్.వి. మురళీధర్ గౌడ్ తదితరులున్నారు.



ప్రమాదవశాత్తూ కుమారున్ని కోల్పోయిన కరీంనగర్ పట్టణానికి చెందిన ప్రముఖ ఇంజినీర్ కోల అన్నారెడ్డి. వారి కుటుంబాన్ని పరామర్శించిన ఎంఎల్సి టీ. జీవన్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.



జనగామ జిల్లాలో నీట మునిగిన ఆర్.టి.వో. కార్యాలయం

## కమ్యూనిటీ హాల్లకు ప్రొసిడింగ్ లెటర్ ఇచ్చిన ఎమ్మెల్యే కల్వకుంట్ల

**ఇబ్రహీంపట్నం జూలై 23 (ప్రజామంటలు):** మండల కేంద్రంలోని కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాల





సంఘ కమ్యూనిటీ భవనము కొరకు రూ. 4.50 లక్షలు, ముదిరాజ్ సంఘ భవనం కొరకు రూ. 4.60 లక్షలు ప్రొసిడింగ్ ఇవ్వడం జరిగింది. కోమటి కొండాపూర్ ఎర్దండి గ్రామాల మధ్య రహదారిపై నూతన హై లెవెల్ బ్రిడ్జి నిర్మించుట కొరకు వంతెన ప్రక్కన తాత్కాలిక రోడ్డు వేయడం వలన రెండు గ్రామాల వ్యవసాయదారులు ఇబ్బంది పడుతున్నారు. అనంతరం కోమటి కొండాపూర్ గోదావరి పరివాహక ప్రాంతాల పంట నష్టాలను పరిశీలించారు.

## విద్యార్థులచే బోనాల జాతర

**జగిత్యాల జూలై 23 (ప్రజామంటలు):** బోనాల జాతర సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్నారు. ఆల్ఫోర్స్ స్కూల్



(ఎన్.ఎస్.వి) లో పోతురాజు వేషాలలో అలరించారు మరియు బోనమెత్తుకొని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ అత్యంత ప్రీతి ధాయకమని పేర్కొన్నారు. మహిళలలకు అత్యంత ఆరాధ్యమైన పండుగ బోనాల పండుగని బోనాలను ఎత్తుకోవడం ద్వారా ఇండ్లలో ఆయురారోగ్యాలతో పాటు శుభ ఫలాలు సిద్ధిస్తాయని తెలిపారు. తెలంగాణలో ప్రతి గ్రామాలలో బోనాల ఉత్సవాలు వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా నేడు బోనాల పండుగ నిర్వహిస్తూ మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయల విలువ రెట్టింపు అయ్యేలా చేస్తున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా కేంద్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో హైద్రాబాద్ వెళ్ళే హైవే పై భారీగా నిలిచిన వరదనీరు.

## 10 వేల ఆర్థిక సాయం చేసిన బాల్య మిత్రులు

**గొల్లపల్లి జులై 23 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలం లోని శ్రీరాం పల్లి గ్రామంలో పోడేటి మహేష్ నిరుపేద యువకుడు మెరుగైన వైద్యం కోసం వరంగల్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందుతుండగా బాధ్యత మిత్రుడికి 2012-13 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన బాల్య మిత్రులు 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందించి శనివారం ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన బొమ్మేన జలంధర్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు సమావేశమై తోటి మిత్రులు ఆపదలో ఉన్నాడని చలించిపోయి తన వంతుగా తల కొంత పోగు చేసుకుని బాధితుడి తండ్రి పోడేటి పోడేటి గంగారాంకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా తన మిత్రుడు త్వరగా కోలుకోవాలని అభిలాషించారు. నిరుపేద యువకుడికి అండగా నిలిచిన బాల్య మిత్రులను పలువురు అభినందించారు.



# జగిత్యాల డిపిఆర్వో వైఖరిపై జర్నలిస్టుల ధర్నా

- కలెక్టరేటు ఎదుట మూడు గంటలకు పైగా వానలో బైటాయించిన జర్నలిస్టులు
- సమస్య తెలుసుకొని స్పందించిన మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్

**జగిత్యాల జులై 23 (ప్రజామంటలు):** ప్రభుత్వానికి జర్నలిస్టులకు అనుసందాన కర్తగా పనిచేయాల్సిన జగిత్యాల డిపిఆర్వో శ్రీధర్ జర్నలిస్టుల పట్ల చులకన భావాన్ని ప్రదర్శిస్తూ, జర్నలిస్ట్ ల ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరిస్తూ, కలెక్టర్ ను తప్పుదోవ పట్టిస్తున్నాడని తక్షణమే కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల టియుడబ్ల్యూ (ఐ జె యు) అనుబంద సంఘాలు డిమాండ్ చేశాయి. కలెక్టరేటు ఎదుట ఉదయం పదిన్నరకు బైటాయించిన జర్నలిస్టులు డిపిఆర్వో శ్రీధర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టర్ రావాలంటూ నినాదాలు చేశారు. మూడున్నర గంటలకు పైగా సాగిన జర్నలిస్టుల ధర్నా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజయ్ ఈ విషయాన్ని వివిధ కార్యక్రమాలకై జగిత్యాల కు వస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూ (ఐజె యు) జగిత్యాల జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగిత్యాల డిపిఆర్వో గా పనిచేస్తున్న శ్రీధర్ ఇదివరకే పెద్దపల్లిలో పనిచేసిన సందర్భంలో వివిధ ఆరోపణలను ఎదుర్కొన్నారన్నారు. తీరా జగిత్యాల కు వచ్చిన తరువాత కూడా జర్నలిస్టులపై చులకన భావం పోలేదన్నారు. ప్రజభుత్వానికి జర్నలిస్టుల మధ్య అనుసందనకర్తగా పనిచేయాల్సిన డిపిఆర్వో శ్రీధర్ విభజించు పాలించు అన్న రీతిలో జర్నలిస్టుల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నడని అన్నారు. ప్రభుత్వ విషయంలో సరియైన సమాచారాన్ని జర్నలిస్టులకు ఇవ్వకుండా తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తీరా అక్రిడేషన్స్ జారీ సమయంలోను జర్నలిస్టుల మధ్య విభేదాలు తెచ్చేలా ప్రయత్నాలు చేశారన్నారు. ఇలాంటి డిపిఆర్వో తో ప్రభుత్వానికి జర్నలిస్టుల మధ్య అఘాదం ఏర్పడి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఫలాలు ప్రజలకు చేరవని అన్నారు. తక్షణమే కలెక్టర్ స్పందించి డిపిఆర్వో శ్రీదర్ పై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూ (ఐ జె యు)జిల్లా, జగిత్యాల ప్రెస్ క్లబ్ తోపాటు అనుబంధ సంఘాల నాయకులు, రిపోర్టర్స్ పాల్గొన్నారు.

### స్పందించిన మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే లు ....

జర్నలిస్టులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నారన్న సమాచారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో తెలుసుకున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ జర్నలిస్టులను టౌన్ హాలుకు రావాలని సమాచారం పంపారు. కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టుల ముందుకు ఎంతకు కలెక్టర్ రాకపోవడం కార్యాలయ ఏ ఓ రావడంతో జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకొంటున్న మంత్రి ఈశ్వర్ మరోసారి జర్నలిస్టులకు ఆహ్వానం పంపారు. మంత్రి ఆహ్వానంతో స్పందించిన చీటి శ్రీనివాసరావు సారథ్యంలోని జర్నలిస్టులు నేరుగా టౌన్ హాలుకు చేరుకొన్నారు. అక్కడికి వచ్చిన జర్నలిస్టులను చూసిన మంత్రి ఈశ్వర్ సభా వేదికపై నుంచి ప్రసంగాన్ని తొందరగా ముగించి జర్నలిస్టుల వద్దకు చేరుకున్నాడు. పూర్తి విషయాలను అడిగి తెలుసుకొన్న మంత్రి ఈశ్వర్ జగిత్యాల డిపిఆర్వో పై ఇదివరకే తనకు ఫిర్యాదులు



వచ్చాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా జర్నలిస్టుల పక్షాన నిలవాల్సిన డిపిఆర్వో తీరు ఆక్షేపనీయమని అన్నారు. వెంటనే సి.ఎం. కార్యాలయ అధికారులతో మాట్లాడిన మంత్రి ఈశ్వర్ తక్షణమే డిపిఆర్వో పై సత్వర చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జా రిచేయాలని మంత్రి ఈశ్వర్ ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల కు ప్రభుత్వం నేను మా ఎమ్మెల్యేలు నిరంతరం సేవచేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఏ సమస్య వచ్చినా నేరుగా తనకే ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చని మంత్రి ఈశ్వర్ అన్నారు. కానీ కొందరు మమ్ములను బాధించే రీతిలో ఉద్దేశం పూర్వకంగా వార్తలను రాస్తూ మా అందరిని బాధకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా పరంగా జరిగిన తప్పులను ఎత్తి చూపే అధికారం మీడియాకు ఉందని కానీ కొందరు పని కట్టుకొని తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని మంత్రి ఈశ్వర్ విజ్ఞప్తి చేశారు. సహాకారనికి, సంక్షేమానికి ప్రభుత్వం మా ఎమ్మెల్యేలు, మంత్రులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారనే విషయాన్ని ఎప్పుడు గుర్తుంచుకోవాలని ఏ సమయంలోనైన త నకు ఫోన్ చేసి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించుకోవాలని అందుకు సిద్ధంగా ఉంటానని మంత్రి ఈశ్వర్ జర్నలిస్టులకు భరోసా కల్పించారు. ఈ సమయంలో టియుడబ్ల్యూ (ఐజెయు) జిల్లా కార్యవర్గంతో పాటు, జగిత్యాల ప్రెస్ క్లబ్ బాద్యులు, సభ్యులు ఉన్నారు.

# జిల్లా స్థాయికి ఎంపికైన విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ పాఠశాల విద్యార్థి

**హుజూరాబాద్ జూలై 23 (ప్రజామంటలు):** జిల్లాలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థిని విద్యార్థులకు మండల స్థాయి పోటీలు శుక్రవారం హుజూరాబాద్ మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా పాఠశాల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను మండల స్థాయికి పంపడం జరిగింది. ఇందులో ఉపన్యాస పోటీ అంశమైన పరిసరాల పరిశుభ్రత- ఒకసారి వినియోగించి పడవేసే ప్లాస్టిక్ వస్తువుల నిషేధం పైన పోటీ నిర్వహించగా జెడ్పిహెచ్ఎస్ చెల్పూర్ విద్యార్థి ఎం. అఖిల్ తేజ్ కి ప్రథమ బహుమతి లభించగా, విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ పాఠశాల విద్యార్థి మిడిదొడ్డి నిహాల్ కి ద్వితీయ బహుమతి లభించింది. వ్యాసరచన పోటీ అంశం అయిన సీజనల్ వ్యాధులు, వ్యాప్తి, నియంత్రణ, నివారణ లో ఎన్ రామ్ చరణ్ జెడ్పిహెచ్ఎస్ చెల్పూర్ విద్యార్థి కి ప్రథమ బహుమతి లభించగా, బి రక్షిత జెడ్పిహెచ్ఎస్ (బాలికలు) హుజూరాబాద్ కి ద్వితీయ బహుమతి లభించింది. అలాగే డ్రాయింగ్ అంశం అయిన గ్రామము, పచ్చదనము, పరిశుభ్రత పై పోటీ నిర్వహించగా జి. శివాని జెడ్పిహెచ్ఎస్ (బాలికలు) కి ప్రథమ బహుమతి లభించగా, ఏ. హర్షవర్ధన్ జెడ్పిహెచ్ఎస్ కందుగుల కుద్వితీయ బహుమతి లభించింది. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపబోతున్నట్టు మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ లోని మొత్తం ప్రైవేట్



పాఠశాలల నుండి కేవలం విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ పాఠశాల విద్యార్థి ఉపన్యాస పోటీలో ద్వితీయ బహుమతి సాధించడంతో పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్, డైరెక్టర్ తిరుపతి యాదవ్, ప్రిన్సిపల్ కొండబత్తిని శ్రీనివాస్, అధ్యాపక బృందం విద్యార్థి నిహాల్ ను అభినందించారు.

## అసెంబ్లీ సాక్షిగా వీఆర్ఏ లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

**జనగామ జూలై 23 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలోని స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట విఆర్ఏ జెఏసి ఆధ్వర్యంలో జనగామ జిల్లాలోని వి.ఆర్.ఏ. లు గత 3 రోజులుగా రిలే నిరాహార



దీక్షలు చేస్తున్న సందర్భంగా వారి ఆహ్వానం మేరకు దీక్ష శిబిరాన్నిఎం.ఎస్.పి, ఎం.అర్. పి.ఎస్, ఎం.ఎస్. ఎఫ్, ఎం.ఇ.ఎఫ్, వి.హెచ్ పి.ఎస్. బృందంతో సందర్శించి సంఘీభావం ప్రకటించారు. గ్రామంలో ప్రతి అంశాన్ని నమోదు, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అమలులో ప్రధాన భూమికను పోషిస్తూ అహర్నిశలు శ్రమించే విఆర్ఏ ల బ్రతుకు మీద భవిష్యత్తు మీద దెబ్బకొట్టే కుట్రలను కేసీఆర్ మానుకొని ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, పే-స్కెల్ ప్రకటించి నాడు వేటినైతే హామీలిచ్చిండో వాటన్నింటినీ నెరవేర్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ మీ పక్షాన పోరాటాన్ని ఉధృతం చేసేలా, మీ హక్కులు నెరవేరేలా, ఒక బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించేలా కృషిని చేస్తామని అన్నారు. ఎం.ఇ.ఎఫ్ జాతీయ సంయుక్త కార్యదర్శి చెప్పాల ప్రసాద్ మాదిగ, ఎం.ఎస్. పి జిల్లా ఇంచార్జి ఇనుముల నర్సయ్య మాదిగ, మండల ఇంచార్జి నీర్మాల భాస్కర్ మాదిగ, టౌన్ ఇంచార్జి గువ్వల రవి మాదిగ, వి.హెచ్. పి.ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిర్రు నగేష్ ఉన్నారు.

## వరి పొలము గట్ల వెంబడి కందిసాగు వలన రైతులకు అదనపు ఆదాయము

### మండల వ్యవసాయ అధికారి

**హుజురాబాద్ జూలై 23 (ప్రజామంటలు):** హుజురాబాద్ మండలంలోని కాట్రపల్లి, ఇప్పల నర్సింగపూర్ మరియు తుమ్మనపల్లి లలో వరి నాట్లు వేసిన రైతుల పొలం గట్లపై కంది పంటను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి చందుపట్ల సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. రైతులతో కలిసి కంది గింజలను గట్ల వెంబడి నాటారు. దీని వలన ఖాళీగా విడిచిన గట్లపై అదనపు ఆదాయం పొందవచ్చునని, కనీసం ఇంటికీ సరిపడు కందులను పొందవచ్చునని అన్నారు. వ్యవసాయంలో మన రైతులు ఒకప్పుడు కంచంలో అన్నముతో పాటు ఏమి వేసుకొని తిన్నామో అవి మన క్షేత్రములో పండించినవే తినేవారు అని రైతులకు గుర్తు చేశారు. కానీ ఇప్పుడు కేవలం వరి సాగుకు మొగ్గు చూపుతున్నారని, ఇతర పంటలైన కంది, పెసర, మినుము, శనగ లాంటి అవురాల సాగు కూడా చేసుకోవాలని కోరారు. వరి పొలములో గట్ల వెంబడి కంది సాగు చేయు రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలన్నారు. ఈ సాగులో ఎర్రచెల్కా, నల్లరేగడి నేలలలో అనుకూలమని, ఎల్.ఆర్.జి-41, ఆశ, మారుతి, పాలెం కంది, వరంగల్ కంది-53 లాంటి కంది రకాలను సాగు చేయవచ్చునని అన్నారు. వానకాలములో రకాన్ని బట్టి 150 నుండి 180 రోజులు పంట కాలము ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమములో వ్యవసాయ విస్తరణ అధికారులు పొద్దుటూరి సతీష్ రెడ్డి మరియు ఉజ్మా నిషాత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గూడూరి మహేందర్ రెడ్డి, రైతు బంధు సమితి సభ్యులు బద్దం రాజేశ్వర్ రెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి మహిళా న్యాయవాదులు సదస్సు

**హన్మకొండ జులై 23 (ప్రజామంటలు):** మడికొండలో రాష్ట్రస్థాయి రెండో మహిళా న్యాయవాదులు సదస్సు శనివారం హనుమకొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నారు. ఈమేరకు శుక్రవారం



అఖిలభారత న్యాయవాదుల సంఘం వరంగల్ వారు ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత న్యాయవాదుల సంఘం వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2 రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సును ఈరోజు ఉదయం 10.30 ని.లకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి ప్రారంభిస్తారని వారు పేర్కొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన చీఫ్ విప్, దాస్యం

**హన్మకొండ జులై 23 (ప్రజామంటలు):** కాకతీయ యూనివర్సిటీ టిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటిఆర్




జన్మదినాన్ని పురస్కరించుకుని గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంసా పత్రం అందజేశారు. అనంతరం పోటీ పరీక్షల అభ్యర్థులకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం ద్వారా మెటీరియల్ పంపిణీ చేశారు. కూడా ఛైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ తదితరులున్నారు.



కరీంనగర్ లోని విద్యానగర్ కు చెందిన జి. రజిత (41) వెన్నెముక ఆపరేషన్ నిమిత్తం మహిళను 32వ సారి రక్తదానంతో ఆదుకున్న జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ పీజీ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపికృష్ణ.

## శ్రీశైలం జెన్.కో. పవర్ హౌస్ ను సందర్శించిన వినోద్ కుమార్

**హైదరాబాద్ జూలై 23 (ప్రజామంటలు):** శ్రీశైలంలోని జెన్.కో. అండర్ గ్రౌండ్ పవర్ హౌస్ హైడ్రో పవర్ స్టేషన్ ను రాష్ట్ర ప్రణాళికా సంఘం



వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జెన్.కో. ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పరిశీలించారు. హైడ్రో పవర్ స్టేషన్ పనితీరు గురించి వినోద్ కుమార్ కు శ్రీశైలం పవర్ హౌస్ చీఫ్ ఇంజనీర్ రామసుబ్బారెడ్డి వివరించారు. కొంతకాలం కిందట జరిగిన అగ్నిప్రమాద దుర్ఘటన తరువాత శ్రీశైలం పవర్ హౌస్ లోని మొత్తం ఆరు యూనిట్లలోని ఐదు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి సాగుతోందని, త్వరలోనే ఆరవ యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తామని చీఫ్ ఇంజనీర్ రామ సుబ్బారెడ్డి వివరించారు. శ్రీశైలం జెన్.కో పవర్ హౌస్ హైడ్రో పవర్ స్టేషన్ పనితీరు పట్ల వినోద్ కుమార్ సంతృప్తిని వ్యక్తం చేశారు.

## "స్వనిధి మహోత్సవం" కు అన్ని ఏర్పాట్లు చేయాలి



**హన్మకొండ జులై 23 (ప్రజామంటలు):** ఈనెల 30న హన్మకొండ అంబేడ్కర్ భవన్ నిర్వహించే "స్వనిధి మహోత్సవం" కు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ ప్రావీణ్య మెప్మా అధికారులు, ఉద్యోగులను ఆదేశించారు. ఈ మహోత్సవంలో సుమారు 1000మంది వీధి వ్యాపారులు పాల్గొనేలా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. పీఎం స్వనిధి రుణాలు సకాలంలో చెల్లించిన వారిని, డిజిటల్ చెల్లింపులు చేసిన వారిని ఈ కార్యక్రమంలో సన్మానిస్తామని పేర్కొన్నారు.

## రౌడిషీటర్ల కు కౌన్సిలింగ్ నిర్వహించిన ఇనిస్పెక్టర్

**హన్మకొండ జులై 23 (ప్రజామంటలు):** హన్మకొండ పోలీస్ స్టేషన్ కు కొత్తగా వచ్చిన ఎస్సై శ్రీనివాస్ శుక్రవారం రౌడీషీటర్లు కౌన్సిలింగ్



నిర్వహించారు. వారు మాట్లాడుతూ సిటీ పరిధిలో శాంతిభద్రతల విషయంలో చట్టపరమైన చర్యలు గురించి రౌడీ షీటర్లకు వివరంగా తెలియజేశారు. మీలో ఎవరైనా పట్టణంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కబ్జాలు, గొడవలకు దిగినా, సెటిల్ మెంట్, దందాలకు పాల్పడినా వారిపై అవసరమైతే పీడీయాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com